తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సంపుటి: 2 | సంచిక: 212 | సోమవారం 23-12-2024 | పేజీలు: 08 | వెల: 5 | www.telanganamuchatlu.in



# సినీ ప్రముఖుల ఇళ్లపై దాడి ఘటనను ఖండిస్తున్నా..

- హీరో అల్లు అర్జున్ నివాసం దాడిపై స్పందించిన సీఎం
- శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీజీపీ, సీపీకి ఆదేశం
- శాంతిభద్రతల విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించం..
- ఈ కేసుకు సంబంధం లేని పోలీస్ సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి- సీఎం రేవంత్.

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
సినీ ప్రముఖుల ఇళ్లపై దాడి ఘటనను ఖండిస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎక్స్‌లో ఆయన పోస్ట్ చేస్తూ.. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీజీపీ, సీపీకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించం.. సంధ్య థియేటర్ ఘటనలో సంబంధం లేని పోలీస్ సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.
ఆదివారం అల్లు అర్జున్ ఇంటిని ఓయూ జేఏసీ ముట్టడించిన సంగతి తెలిసిందే.. ఇంటిపై టమాటాలు, రాళ్ల దాడి చేశారు. ఈ క్రమంలో.. ఇంట్లో పూల కుండీలు ధ్వంసమయ్యాయి. కాగా.. విషయం తెలుసుకున్న పోలీసులు అల్లు అర్జున్ ఇంటికి చేరుకుని విద్యార్థి సంఘాల నేతలను అదుపులోకి తీసుకున్నారు. 8 మంది ఓయూ జేఏసీ నేతలను జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ తరలించారు. అయితే.. దాడి జరిగిన సమయంలో ఇంట్లో అల్లు అర్జున్ లేరు. దాడి అనంతరం.. అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి అక్కడికి చేరుకుని సెక్యూరిటీ నుంచి వివరాలను అడిగితెలుసుకున్నారు.
ఆదివారం అర్జున్ గురించి సస్పెన్షన్‌కు గురైన ఏసీపీ విష్ణుమూర్తి మాట్లాడారు. గత కొన్ని రోజులుగా పోలీసుల మీద నిందలు వేస్తున్నారు.. డబ్బు మదంతో ఓ హీరో పోలీసుల మీద అనుచిత మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. ఓ కేసులో ముద్దాయిగా ఉన్న హీరో ప్రెస్ మీట్ పెట్టవచ్చా అని ప్రశ్నించారు. ఒక లక్ష పై చిలుకు పోలీసుల కుటుంబాలు ఉన్నాయి.. ఒక్క బందోబస్తు చేయాలంటే కొన్ని నియమాలు ఉంటాయి.. అప్పటికప్పుడు బందోబస్తు కావాలంటే కుదరదని విష్ణుమూర్తి పేర్కొన్నారు. ఒక్క పోలీసు అధికారి కూడా నీ దగ్గరకి రాకుండా చేస్తాం.. ఎలా బయటకి వెళ్తావో ఆలోచించుకో అని అన్నారు. మీ ఇష్టం వచ్చినట్టు చేస్తే ఎవరు ఊరుకోరని విష్ణుమూర్తి హెచ్చరించారు.



# అల్లు అర్జున్ ఇంటిపై దాడి


- ఇంటిని ముట్టడించిన ఓయూ జేఏసీ
- బన్నీ ఇంటి వద్దకు చేరుకుని ఆందోళన
- రేవతి కుటుంబానికి రూ. కోటి ఇవ్వాలని డిమాండ్
- ఇంట్లోకి రాళ్లు రువ్వడంతో పూల కుండీలు ధ్వంసం
- 8 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అల్లు అరవింద్ ఫిర్యాదుతో కేసు నమోదు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
అల్లు అర్జున్ ఇంటిని ముట్టడించేందుకు ఓయూ జేఏసీ యత్నించింది. ఓయూ జేఏసీ అధ్యక్షుడు బైరు నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో అల్లు అర్జున్ ఇల్లు ముట్టడికి ప్రయత్నం చేశారు. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబాన్ని ఆదుకోవాలని నినాదాలు చేశారు. రేవతి కుటుంబానికి రూ. కోటి ఇచ్చి అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఇంటి గోడలు ఎక్కి రాళ్లు రువ్వారు. అల్లు అర్జున్ ఇంట్లో పూల కుండీలు ధ్వంసమయ్యాయి. అల్లు అర్జున్ సెక్యూరిటీ, నిరసనకారుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకుంది. ఉద్రిక్తతల నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని.. నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. అల్లు అర్జున్ ఇంటి ముందు ఆందోళన చేసిన విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. 8 మంది ఓయూ జేఏసీ నేతలను అదుపులోకి తీసుకొని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ తరలించారు. దాడి అనంతరం అల్లు అర్జున్ మామ

మిగతా 2లో

# అల్లు అర్జున్ సీఎంకు క్షమాపణలు చెప్పాలి

- పోలీసులు చెప్పిన ఆధారాలనే సీఎం సభలో ప్రస్తావించారు
- సీఎం రేవంత్‌ను ఎదిరించడం సరికాదు
- ప్రభుత్వంపై నిందలేయడం మానుకోవాలి
- ప్రభుత్వం కక్ష కట్టదు.. సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తుంది
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
పోలీసులు చెప్పిన ఆధారాలతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంధ్యా థియేటర్ తొక్కిసలాట ఘటనపై అసెంబ్లీలో మాట్లాడారని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి మాటలను ఎదిరిస్తూ.. ప్రభుత్వంపై నిందలేస్తూ సినీ నటుడు అల్లు అర్జున్ మాట్లాడిన తీరు సరైంది కాదని, ఆయన వెంటనే సీఎంకు, ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "రద్దీ ప్రాంతంలో రోడ్ షో వద్దని పోలీసులు హెచ్చరించినా, అనుమతి ఇవ్వకున్నా.. అల్లు అర్జున్ ధిక్కరించారు. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతికి, ఆమె కుమారుడు కోమాలోకి వెళ్లడానికి కారణమయ్యారు. ఆ కుటుంబాన్ని కనీసం పరామర్శించే మానవత్వం కూడా లేకుండా పోయింది. ఒక్క రోజు జైలుకు వెళ్లొచ్చినందుకు ఆయనకు మాత్రం పరామర్శల వెల్లువ రావడం విడ్డూరంగా ఉంది. ఐకాన్ స్టార్‌ను అరెస్టు చేస్తావా అని కేటీఆర్ ప్రశ్నించడం ఇంకా హేయంగా ఉంది. చట్టం దృష్టిలో అందరూ సమానమే" అని పేర్కొన్నారు. 'ప్రభుత్వం కక్ష కట్టదు. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తుంది' అని కోమటిరెడ్డి పేర్కొన్నారు.



# సంక్రాంతి నుంచి రేషన్ దరఖాస్తులు!

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
అర్హులైన పేదలకు కొత్తగా రేషన్ కార్డులు అందించేందుకు సంక్రాంతి నుంచి దరఖాస్తుల స్వీకరణకు పౌరసరఫరాల శాఖ సిద్ధం అవుతోంది. ఇందుకోసం ఆదాయ పరిమితి, ఇతర అర్హతలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల్లో ఆదాయ పరిమితిని పరిశీలించారు. గతంలో ఉన్న మార్గదర్శకాల్లో మార్పుచేర్పులు చేయనున్నట్లు సమాచారం. ఆదాయ పరిమితి కొంత పెంచాలని అధికారులు ప్రతిపాదించనున్నట్లు తెలిసింది. వారంలోపే రాష్ట్ర క్యాబినెట్ భేటీ కానున్నట్లు సమాచారం. ఈలోగానే తాజా మార్గదర్శకాలను ఖరారుచేసి సమర్పించనున్నారు. పౌరసరఫరాలశాఖ ప్రతిపాదనలపై మంత్రిమండలి చర్చించి తుది నిర్ణయం తీసుకోనుంది.
పాత మార్గదర్శకాల్లో ఆదాయ పరిమితి.. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణాలు, నగరాల్లో రూ.2 లక్షలుగా ఉంది. ఈ మొత్తాన్ని కొంత పెంచాలని భావిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న వార్షిక ఆదాయ పరిమితిని రూ.1020 వేల వరకు పెంచే ప్రతిపాదన ఉన్నట్లు తెలిసింది. భూమి విషయానికి వస్తే.. 3.5 ఎకరాల్లో పొలం, 7.5 ఎకరాల్లోపు మెట్ట భూమి అర్హతలుగా గతంలో ఉన్నాయి.

**2.82 కోట్ల లబ్ధిదారులు.. లక్షల్లో అర్జీలు**
రాష్ట్రంలో ఇప్పటికే 89.99 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో మొత్తం 2.82 కోట్ల మంది లబ్ధిదారులుగా ఉన్నారు. ఇప్పటికే ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు

మిగతా 2లో



# థియేటర్ వాళ్ల దరఖాస్తును తిరస్కరించాం

- కేసులో న్యాయ సలహాలు తీసుకుని ముందుకు వెళ్తాం
- హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు
- తొక్కిసలాట ఘటనపై ఆధారాలతో వీడియో రిలీజ్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
హైదరాబాద్ లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనపై పోలీసులు సెన్సేషనల్ వీడియోను విడుదల చేశారు. అల్లు అర్జున్ థియేటర్కు రావడం మొద లుకొని

మిగతా 2లో



# రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక సింగరేణి

- భట్టి విక్రమార్క

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
రాష్ట్రంలో బొగ్గు పేరెత్తగానే సింగరేణియే గుర్తుకొస్తుంది. నల్లబంగారానికి సింగరేణి పర్యాయపదమైంది. అంతలా ప్రసిద్ధి పొందిన సింగరేణి.. ఆవిర్భవించి నేటికి 104 ఏండ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం సింగరేణి వ్యాప్తంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం పాల్గొననున్నారు. బొగ్గు వెలికితీతే ప్రధాన బాధ్యతగా ఆవిర్భవించిన సింగరేణి వ్యాపార విస్తరణ, తదితర అనేక రంగాల్లోనూ పయనిస్తున్నది.కొత్త గనులనూ చేపట్టనున్నది. ఒడిశా నైనీ కోల్‌బ్లాక్, కొత్తగూడెంలో వీకే ఓసీ, ఇల్లందులో రొంపేడు

మిగతా 2లో

# రైతుభరోసాపై మంత్రులను, ఎమ్మెల్యేలను నిలదీయండి

- హక్కుగా రావాల్సిన సొమ్మును వదులుకోవద్దు
- సభలో చర్చను సీఎం పక్కదారి పట్టించారు
- రైతులకు కేటీఆర్ బహిరంగ లేఖ



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాలకు వచ్చినప్పుడు రైతుభరోసా సాయంపై నిలదీయాలని రైతులకు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపునిచ్చారు. 'భారాస అంటే భారత రైతు సమితి. మీ అందరికీ మా పార్టీ అండగా ఉంటుంది' అని పేర్కొన్నారు. శాసనసభలో రైతుభరోసాపై చర్చను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఈ పథకం అమలుపై ఎలాంటి సమాధానం చెప్పకుండా ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబించిందన్నారు. ఈ మేరకు రాష్ట్ర రైతులకు కేటీఆర్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. 'రైతుబంధు పథకంపై దుష్ప్రచారం, దాడి చేశారు. అన్నం పెట్టే రైతును దొంగలా చిత్రించే దుర్మార్గానికి ఒడిగట్టారు. రైతులకు పైసలు ఎగ్గొట్టే ఆలోచన చేస్తున్నారు. మార్గదర్శకాలు వెల్లడించకుండానే సంక్రాంతి తర్వాత రైతుభరోసా అనే ఒక్క మాట చెప్పి ప్రభుత్వం తప్పించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల గండాన్ని తప్పించుకోవడం కోసం ఏదో విధంగా మమ అనిపించి ఈ పథకాన్ని పూర్తిగా రద్దు చేయాలని చూస్తున్నారు. అన్నదాతలారా తస్మాత్ జాగ్రత్త. ప్రభుత్వ మోసాన్ని గ్రహించి ఆందోళన చేయాల్సిన సమయం ఇది. ఇప్పుడూ మేల్కొకపోతే రైతుభరోసా ఉండదు. గోస మాత్రమే మిగులుతుంది' అంటూ కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు.

**ఒక్కో ఎకరాకు రేవంత్ సర్కారు రూ.17,500 బాకీ..**
'భారాస హయాంలో మొత్తం 11 సీజన్లలో రూ.73వేల కోట్లను రైతుల ఖాతాలో వేశాం. ఎన్నికల్లో గెలిచి ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ఎకరాకు రూ.15వేల చొప్పున ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టింది.

మిగతా 2లో

# అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీపై కుట్ర

- అల్లు అర్జున్ ను కించపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు
- సినీ ఇండస్ట్రీపై పగ బట్టారు
- గురుకులాల్లో స్టూడెంట్లు చనిపోతే ప్రభుత్వానికి బాధ్యత కాదా?
- రేవంత్ కక్ష సాధింపు చర్యలు వీడాలి
- శ్రీ తేజ్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**
సినీ పరిశ్రమపై పగబట్టినట్లుగా సీఎం రేవంత్రెడ్డి వ్యవహరిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించా రు. సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మృతిని అందరూ ఖండించారన్నారు. శ్రీతేజ్ కోలుకోవా లని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని చెప్పారు.మృతురాలి కుటుంబానికి అందరూ బాసటగా నిలిచారన్నారు. ఈ సమస్య ముగిశాక అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడితో ప్రశ్న అడిగించారని.. సినిమా తరహా కథ అల్లి మళ్లీ సమస్యను సృష్టించారని బండి సంజయ్ ఆరోపించారు. ప్రణాళిక ప్రకారం అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేశారు. అల్లు అర్జున్ వ్యక్తిత్వ హననం చేసేలా సీఎం రేవంత్రెడ్డి వ్యాఖ్యలు చేశారు. గతంలో భారాసను ఎంఐఎం నిండా ముంచింది. ఎంఐఎంను నమ్మితే కాంగ్రె స్కూ భారాస గతే పడుతుంది. కలుషిత ఆహారం తిని గురుకుల విద్యార్థులు చనిపోతున్నారు. వారి కుటుంబాలను సీఎం ఏనాడైనా పరామర్శించారా? ఆ మరణాలకు మీరు బాధ్యత వహించారా? మీకో న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా? ఇకనైనా రేవంత్ కక్ష సాధింపు చర్యలు వీడాలి' అని బండి సంజయ్ అన్నారు.



# అల్లు అర్జున్ ఇంటిపై దాడి

మొదటి పేజీ తరువాయి

చంద్ర శేఖర్ రెడ్డి అల్లు అర్జున్ నివాసానికి చేరుకున్నారు. దాడి ఎలా జరిగింది..? దాడి వివరాలను సెక్యూరిటీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం.. అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డి అల్లు అర్జున్ పిల్లలను తన ఇంటికి తీసుకు వెళ్లారు.మరోవైపు.. అల్లు అర్జున్ నివాసానికి జూబ్లీహిల్స్ పోలీసులు వచ్చారు. దాడి ఘటనపై అల్లు అరవింద్ నుంచి ఫిర్యాదుని జూబ్లీహిల్స్ పోలీసులు స్వీకరించారు. దాడి జరిగిన అంశంపై ఇంట్లో ఉన్న వారి వద్ద నుండి వివరాలు సేకరించారు. అయితే.. దాడి జరిగిన సమయంలో అల్లు అర్జున్ ఇంట్లో లేరు. ఈ క్రమంలో.. సెక్యూరిటీ సూపర్‌వైజర్‌ని వివరాలు అడిగి తెలుసుకుని వెళ్లిపోయారు పోలీసులు. మరోవైపు దాడి నేపథ్యంలో అల్లు అర్జున్ నివాసం వద్ద పోలీస్ ప్రొటెక్షన్ ఏర్పాటు చేశారు. తెలంగాణ బెటాలియన్ పోలీసులతో భద్రత ఉంచారు. సంధ్య థియేటర్ ఘటనపై మాటల యుద్ధం కొనసాగుతుండగా.. ఫ్యాన్స్‌కు కీలక సూచనలు చేశారు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. ఫ్యాన్స్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఎవరినీ కించపరిచేలా పోస్టులు పెట్టకూడదని సూచించారు. కొన్ని రోజులుగా ఫ్యాన్స్ ముసుగులో ఫేక్ ప్రొఫైల్స్‌తో పోస్టులు పెడుతున్నారని.. అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. నెగెటివ్ పోస్టులు పెట్టేవారికి దూరంగా ఉండాలని ఫ్యాన్స్‌కు సూచించారు అల్లు అర్జున్.



# గిరిజన రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలి

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

: రాష్ట్రంలో గిరిజన, లంబాడీ రైతులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకుని రిమాండ్‌లో ఉన్న వారిని తక్షణమే విడుదల చేయాలని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సేవాలాల్ బంజారా సంఘం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సంఘం ఆధ్వర్యంలో 'చలో హైదరాబాద్' నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన తండాలను, గూడేలను ప్రత్యేక గ్రామపంచాయితీలుగా గుర్తించాలని, రూ.5 కోట్ల చొప్పున నిధులను కేటాయించాలన్నారు. బంజారా జాతి ఆరాధ్య దైవం సద్గురు సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి రోజు అయిన ఫిబ్రవరి 15వ తేదీని ప్రభుత్వ సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాంధీనాయక్, పిల్లల వైద్య నిపుణుడు డా.రాజన్న, సలహాదారు వెంకటేశ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు చందూనాయక్, నేతలు తదితరులు పాల్గొన్నారు.




# సమాజానికి 'కాకా' సేవలు ఎనలేనివి

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలుగు ప్రజలందరికీ కాకాగా సుపరిచితులైన జి.వెంకటస్వామి సమాజానికి అందించిన సేవలు ఎనలేనివని.. ఆయన కేంద్ర మంత్రి సహా అనేక పదవులను చేపట్టి వన్నెతెచ్చిన మహోన్నత వ్యక్తి అని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని డా.బీఆర్ అంబేద్కర్ కళాశాలలో నిర్వహించిన వెంకటస్వామి వర్ధంతి, పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న అంబేద్కర్ విద్యాసంస్థల కృషి అభినందనీయమన్నారు. ఏటా రూ.50 లక్షల వితరణతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తోందని.. నాణ్యమైన విద్య, బోధనపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చేందుకూ కృషి చేస్తోందన్నారు. గత భారాస సర్కారు చేసిన అప్పులను చెల్లిస్తూనే.. విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపడుతోందన్నారు. తమ ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల్లోనే 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కార్మిక, సామాజిక, రాజకీయ రంగాలపైనా జి.వెంకటస్వామి చెరగని ముద్ర వేశారని కొనియాడారు. పేదల అభ్యున్నతిని కాంక్షించి పోరాటాలు చేసిన యోధుడిగా అభివర్ణించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు వెంకటస్వామి చేసిన పోరాటం కూడా మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, ఎంపీ వంశీ, ఎమ్మెల్యే, బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థల ఛైర్మన్ వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, నాగరాజు, కరస్పాండెంట్ సరోజ వివేక్, మాజీమంత్రి శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక సింగరేణి

మొదటి పేజీ తరువాయి



ఓసీ, గోలేటి ఓసీల్లో ఉత్పత్తిని ప్రారంభించనున్నది. కొత్తగూడెంలో వెంకటేశ్ ఖని, ఇల్లందులో జవహర్‌ఖని గనులకు అనుమతలు పొందింది. రామగుండంలో 500 మోగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనున్నది. ఇటీవలే కార్బన్‌డయాక్సైడ్ నుంచి మిథనాల్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి సంకల్పించింది.లిథియం సహా ఇతర ఖనిజాల తవ్వకాలపైనా సింగరేణి దృష్టిపెట్టింది. జియోథర్మల్, గ్రీన్ హైడ్రోజన్, అమ్మోనియం నైట్రేట్ తయారీకి చర్యలు చేపట్టింది. టీజీ జెన్‌కోతో కలిసి రామగుండంలో కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నిర్మించనున్నది. రాజస్థాన్‌లో సోలార్ ప్లాంట్‌ను నిర్మించనుంది. ఇంతటి ఘనకీర్తిని కలిగిన సింగరేణిని పలు సమస్యలు వెన్నాడుతున్నాయి.

**రాష్ట్ర అభివృద్ధికి వెన్నెముక**

సింగరేణి కాలరీస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క సింగరేణి కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బొగ్గు ఉత్పత్తి ద్వారా రాష్ట్ర, దేశ ఇంధన అవసరాలను తీర్చడంలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తూ, రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తోందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి వెన్నెముకగా నిలుస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలోని ఆరు జిల్లాల్లో లక్షల మంది ప్రజలకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా జీవనాధారంగా ఉన్న సింగరేణిని కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా ఇతర రంగాలలోకి కూడా ప్రవేశించి మరింత విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. సింగరేణి సంస్థ సుస్థిర భవిష్యత్ కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, శ్రమశక్తిని చాటుతూ సంస్థను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ పునరంకితమవాలని ఆయన కోరారు.

# రైతుభరోసాపై మంత్రులను, ఎమ్మెల్యేలను నిలదీయండి

మొదటి పేజీ తరువాయి



ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదైంది. మొత్తం మూడు సీజన్లకు కలిపి గత యాసంగికి కోత పెట్టిన రూ.2,500 సహా ఒక్కో రైతుకు ఒక్కో ఎకరాకు మొత్తం రూ.17,500 రేవంత్ సర్కారు బాకీ పడింది. హక్కుగా రావాల్సిన ఈ సొమ్మును రైతులు వదులుకోవద్దు. ఈ పథకానికి కేంద్రం అమలు చేసే పీఎం కిసాన్ మార్గదర్శకాలను అమలు చేస్తామని అంటున్నారు. ఇదే జరిగితే రాష్ట్రంలో సగం మంది అన్నదాతలకు కూడా పెట్టుబడి పైసలు రావు. రైతుబంధు లబ్ధిదారుల్లో 80శాతం మంది దళిత, గిరిజన, బహుజన రైతులే ఉన్నారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 22లక్షల మంది కౌలు రైతులకూ ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ప్రభుత్వం వద్ద సమాధానం లేదు' అని కేటీఆర్ లేఖలో రైతులకు వివరించారు.



# సంక్రాంతి నుంచి రేషన్ దరఖాస్తులు!

మొదటి పేజీ తరువాయి

వచ్చిన దరఖాస్తుల్లో ప్రతిపాదిత లబ్ధిదారుల సంఖ్య 26 లక్షలుగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో నిర్వహించిన ప్రజాపాలనలో కొత్త రేషన్‌కార్డుల డిమాండ్‌పై అంచనా వేశారు. దాదాపు 10 లక్షల పైచిలుకు దరఖాస్తుల్లో ప్రతిపాదిత లబ్ధిదారుల సంఖ్య 32 లక్షలుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 'వీరికీ ఇస్తే రాష్ట్రంలో రేషన్ లబ్ధిదారుల సంఖ్య 3.4 కోట్లు అవుతుంది. రాష్ట్ర జనాభా 3.80 కోట్లు' అని ఓ అధికారి తెలిపారు. క్యాబినెట్ సమావేశం తర్వాత కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వనుంది. సంక్రాంతి పండక్కి అటూఇటుగా ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని పౌరసరఫరాల శాఖ వర్గాలు తెలిపాయి



# తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోంది

- ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని, ఈ చర్యను అంతా కలిసికట్టుగా అడ్డుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర మహిళలను, పండగలను అవమానించారని మండిపడ్డారు. ఆదివారం భారాస, తెలంగాణ జాగృతి ఎన్నారై విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఆన్‌లైన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. "ఉద్యమ సమయంలో ఎన్నారైలు పోషించిన పాత్ర మరువలేనిది. ఎన్ని అవమానాలు, అవహేళనలు ఎదురైనా తెలంగాణ తల్లి రూపం స్ఫూర్తి నింపింది. ఉద్యమకారులు, కవులు, కళాకారులు కలిసి ఇచ్చిన ఆ తల్లి రూపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మార్చడం దారుణం. ఈ విషయంలో మరో పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చింది" అని కవిత పేర్కొన్నారు. బతుకమ్మ పండగకు ప్రపంచవ్యాప్త గుర్తింపు రావడంలో ఎమ్మెల్సీ కవిత ఎంతో కృషి చేశారని ఎన్నారై నాయకులు అన్నారు. భారాస ఎన్నారై విభాగానికి చెందిన మహేశ్ బిగాల సమన్వయకర్తగా వ్యవహరించిన సమావేశంలో ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ అనిల్ కూర్మాచలం, జాగృతి రాష్ట్ర నేత నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# థియేటర్ వాళ్ల దరఖాస్తును తిరస్కరించాం

మొదటి పేజీ తరువాయి

ఘటన అనంతరం బయటకు వెళ్లే దృశ్యాలు ఈ వీడియో ద్వారా వివరించారు. నిన్న ప్రెస్మీట్లో అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ ఆధారాలు బయట పెట్టారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 4న రాత్రి సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని చెప్పారు. ప్రీమియర్ షోకు అల్లు అర్జున్ వస్తున్నారనిబందోబస్తు కోసం థియేటర్ వాళ్లు దరఖాస్తు చేస్తే తిరస్కరిం చామని తెలిపారు. అల్లు అర్జున్ వస్తే బందోబస్తు కల్పించలేమని, ఆయన రావొద్దని స్పష్టంచేశామని తెలిపారు. థియేటర్ వాళ్లు అల్లు అర్జున్కు ఆ విషయం చెప్పారో... లేదో తమకు తెలియదన్నారు. తొక్కిసలాట అనంతరం విషయం చెప్పేందుకు అల్లు అర్జున్ వద్దకు వెళ్లేందుకు ఎస్‌ఎచ్వో తీవ్రంగా కష్టపడాల్సి వచ్చిందన్నారు. సంధ్య థియేటర్ ఘటనలో బౌన్సర్లే గేట్లు తీయడం, వేయడం చేశారన్నారు. ప్రజలను, పోలీసులను కూడా బౌన్సర్లో నెట్టేస్తున్నారని సీరియస్ అయ్యారు.




# పాప్‌కార్న్ పైనా జీఎస్టీ

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

పాప్‌కార్న్ ప్రియులకు బిగ్ షాక్ తగిలింది. భార్య, పిల్లలు లేదా స్నేహితులతో కలిసి థియేటర్‌లో సరదాగా ఆస్వాదించే పాప్ కార్న్ మరింత ఖరీదైనదిగా మారనుంది. ఈ మేరకు దేశంలో పాప్‌కార్న్‌పై మూడు రకాల పన్నులు విధిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. విభిన్న రుచుల ఆధారంగా జీఎస్టీ నిర్ణయించనున్నట్లు రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో ఆమె అధ్యక్షతన జరిగిన 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో స్పష్టం చేశారు.

**3 రకాల జీఎస్టీ రేట్లు..**

ఈ మేరకు జీఎస్టీ కౌన్సిల్ రుచి ప్రకారం పాప్‌కార్న్‌ను వివిధ స్లాబ్‌లలో చేర్చింది. మార్కెట్‌లో లభించే రుచులను బట్టి పాప్‌కార్న్‌పై 3 రకాల జీఎస్టీ రేట్లను విధించేందుకు కౌన్సిల్ అంగీకరించింది. చక్కెర, ఉప్పు, మసాలాలతో కూడిన పాప్‌కార్న్‌పై పన్ను విధించబడుతుంది కౌన్సిల్ సమావేశంలో పేర్కొన్నారు. ఇక రెడీటుఈట్ పాప్‌కార్న్‌పై పన్ను రేట్లకు సంబంధించిన పూర్తి వివరాలను కూడా వెల్లడించారు. సాధారణ ఉప్పు, సుగంధ ద్రవ్యాలతో తయారు చేయబడి పాప్ కార్న్‌పై 5 శాతం జీఎస్టీ వర్తిస్తుంది. ఉప్పు, మసాలా దినుసులతో కూడిన పాప్ కార్న్ లేబుల్ చేసి విక్రయిస్తే 12శాతం జీఎస్టీ ఉటుంది. పంచదార వంటి తీపి పదార్థాలతో తయారు చేయబడిన పాప్‌కార్న్‌పై 18 శాతం చొప్పున జీఎస్టీ విధించబోతున్నట్లు పేర్కొన్నారు. ఈ 55వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాప్‌కార్న్‌పై జీఎస్టీకి సంబంధించి మాత్రమే కాకుండా పలు కీలక నిర్ణయాలు కూడా తీసుకున్నారు. EV, పెట్రోల్, డీజిల్ కార్లను రీసెల్ చేసే కంపెనీ/రిజిస్టర్డ్ యూజ్డ్ కార్ల విక్రేత మార్జిన్ ధరపై 18 శాతం GST చెల్లించాలి. వ్యక్తిగత కొనుగోలుదారు లేదా విక్రేతకు ఇది 12% మాత్రమే ఉంటుందని తెలిపారు.



# మిర్చి రైతుకు నిరాశే

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

గతేడాది మిర్చికి మంచి ధర పలికింది. విత్తన రకాన్ని బట్టి క్వింటాలు రూ.23 వేల నుంచి రూ.90 వేల వరకు అమ్ముడుపోయింది. అదే ఆశతో ఈసారి పంట సాగు చేసిన రైతులకు నిరాశే మిగిలింది. వాతావరణ పరిస్థితుల కారణంగా పంటకు నల్ల తామర (బ్లాక్ త్రిప్స్), ఆకుముడత, రసం పీల్చే పురుగు ఆశించడం, వివిధ రకాల తెగుళ్లు సోకడంతో దిగుబడి భారీగా తగ్గింది. గతంలో ఎకరాకు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా.. ఈ ఏడాది 6 నుంచి 8 క్వింటాళ్లకు పడిపోయింది. దిగుబడి తగ్గడంతో ధరలైనా పెరుగుతాయని ఆశించగా.. రోజురోజుకు ధరలు పతనమవుతున్నాయి. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.6 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేస్తుండగా.. ఎక్కువగా వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వేశారు. రాష్ట్రానికే ప్రత్యేకమైన చపాటా మిర్చిని కేవలం ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే సాగు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు మంచి ధరలు పలికిన దేశీ, తేజ రకం మిర్చి రకాలు ప్రస్తుతం నేలచూపు చూస్తున్నాయి. రాష్ట్రంలోనే పెద్దదైన వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో తేజ రకం గతేడాది క్వింటాకు రూ.23 వేలకు పైగా పలకగా.. ఈసారి రూ.16 వేలు మించడం లేదు. దీంతో ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి సాగుచేసిన రైతులకు నష్టాలే మిగిలేలా ఉంది. ప్రస్తుతం మార్కెట్‌కు తేజ రకం వస్తుండగా.. వచ్చే నెల మొదటి వారం నుంచి దేశీ, చపాటా రకాలు రానున్నాయి.

**ఎగుమతులు తగ్గడంతోనే..**

రాష్ట్రంలో పండే మిర్చి పంటకు అంతర్జాతీయంగా మంచి పేరుంది. కొన్నేళ్లుగా చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, మలేసియా, థాయ్‌లాండ్, ఇండోనేసియా తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది చైనాలో భారీ విస్తీర్ణంలో సాగు చేయగా గతంతో పోలిస్తే దిగుబడులు బాగున్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎగుమతులు తగ్గిపోయాయి. వీటి ప్రభావం ధరలపై పడిందని వ్యాపారులు చెబుతున్నారు. వివిధ రకాల నూనెల తయారీలో వాడే తేజ రకం మిర్చిని కంపెనీలు గతంలో ఇక్కడి నుంచే కొనుగోలు చేసేవని, ఇప్పుడు కర్ణాటకలో సాగుచేస్తున్న 5531 రకానికి ప్రాధాన్యమివ్వడమూ ధరలు తగ్గడానికి ఓ కారణమని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**శీతల గిడ్డంగుల కొరత**

రాష్ట్రవ్యాప్తంగా 20 వేల శీతల గిడ్డంగులుండగా.. వాటిలో సుమారు 60 లక్షల బస్తాల వరకు మిర్చి నిల్వ ఉంది. వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఒక్కోటి 80 వేల నుంచి 1.20 లక్షల బస్తాల నిల్వ సామర్థ్యం ఉన్న 25 శీతల గిడ్డంగులున్నాయి. ఇప్పటికే వీటిలో 23 లక్షల బస్తాల వరకు నిల్వ చేశారు. ఎక్కువ ధరలు వచ్చేదాకా నిల్వ చేద్దామంటే గిడ్డంగులు నిండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# రూ. 6 వేల కోట్లు అవసరం




**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

భూమిలేని నిరుపేదలకు నగదు బదిలీ, అన్నదాతలకు రైతుభరోసా పథకాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. వ్యవసాయ భూమి లేకుండా, కేవలం కూలి పనులతో జీవిస్తున్న అత్యంత నిరుపేదలకు ఆర్థిక సాయం చేసే పథకాన్ని ఈ నెలలోనే ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో మొత్తం కుటుంబాలు 1.16 కోట్లు అని ఇటీవల నిర్వహించిన ఇంటింటి సర్వేలో తేలింది. పట్టాదారు పాసుపుస్తకాలున్న మొత్తం రైతులు 70 లక్షలని రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. మిగిలిన 46 లక్షల కుటుంబాలకు భూమి లేనట్టే. వీరిలో నిరుపేదలను గుర్తించేందుకు 'జాతీయ ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డు'ను ప్రాతిపదికగా తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్రంలో మొత్తం 53 లక్షల మందికి ఉపాధి హామీ గుర్తింపు కార్డులున్నా.. వారిలో 32 లక్షల మంది మాత్రమే రోజూ కూలికి వెళుతున్నట్లు కార్డులు చలామణిలో ఉన్నాయి. మొత్తం కార్డుదారుల్లో వ్యవసాయ భూమిలేని వారు దాదాపు 15 లక్షల నుంచి 16 లక్షల వరకూ ఉండవచ్చని ప్రాథమిక అంచనా. వీరికి రూ.6 వేల చొప్పున నగదు బదిలీకి దాదాపు రూ.వెయ్యి కోట్ల వరకూ అవసరం అని ఆర్థికశాఖ అంచనా వేస్తోంది. ఇప్పటివరకు ఉన్న అంచనాలివి. అయితే ప్రభుత్వం ఏ ప్రాతిపదికన లబ్ధిదారులను ఖరారు చేస్తుందన్నది కసరత్తు పూర్తయితే గానీ స్పష్టత రాదు. ఈ పథకం కింద ఒక్కో నిరుపేద కూలి కుటుంబానికి ఏటా రూ.12 వేలు ఇస్తామని, అందులో తొలి విడత రూ.6 వేలను ఈ నెల 28న విడుదల చేస్తామని భట్టి ప్రకటించిన సంగతి తెలిసిందే.

**రైతు భరోసాకు సైతం..**

ఈ ప్రక్రియ పూర్తయిన తరవాత రైతుభరోసా పథకానికి నిధుల సమీకరణపై ఆర్థికశాఖ దృష్టి పెట్టనుంది. వచ్చే నెల 14న సంక్రాంతి పండగ నుంచి రైతుభరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో సొమ్ము వేస్తామని సీఎం, మంత్రులు ఇప్పటికే పలుమార్లు వెల్లడించారు. దీనికి అర్హులైన రైతుల గుర్తింపునకు కొత్త మార్గదర్శకాలను త్వరలో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. అనర్హుల తొలగింపుపై మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే పలు వర్గాలతో చర్చించింది. గతంలో రైతుబంధు పథకం కింద పంట సాగుచేయని భూముల యజమానులకు రూ.21 వేల కోట్లకు పైగా ఇచ్చారని ప్రకటించిన ప్రభుత్వం.. రైతుభరోసా పథకాన్ని వాస్తవంగా సాగుచేసే నిజమైన రైతులందరికీ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. కొండలు, గుట్టలు, రహదారుల పేరుతో కూడా పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నందున వాటిని గుర్తించేందుకు చర్యలు ప్రారంభించింది. ఈ కసరత్తులన్నీ పూర్తిచేసి సంక్రాంతి నుంచి రైతుభరోసా ఇవ్వాలంటే కనీసం రూ.56 వేల కోట్లు కావాలని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202425) రాష్ట్ర బడ్జెట్‌లో రైతుభరోసా పథకానికి రూ.15 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించినందున నిధుల విడుదలకు సమస్యలు లేవు. కానీ ప్రస్తుతమున్న ఆర్థిక పరిస్థితుల్లో ఒకేసారి రూ.ఆరేడు వేల కోట్లను సమీకరించడమే అసలు సమస్య అని తెలుస్తోంది. సంక్రాంతి నాటికి బాండ్ల విక్రయం ద్వారా మరో రూ.4 వేల కోట్ల వరకూ రుణాలను సేకరించే అవకాశాలున్నాయి. గత వారంలో రూ.1500 కోట్ల రుణాలను బాండ్ల విక్రయం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. పన్నుల ద్వారా కూడా ఆదాయం పెంచాలని సంబంధిత శాఖలను ప్రభుత్వం తాజాగా ఆదేశించింది. సాధారణంగా ప్రతి ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం (జనవరి, ఫిబ్రవరి, మార్చి) లో పన్నుల ద్వారా అధిక ఆదాయం వస్తుంది. ఈ ఏడాది కూడా అదే ఆనవాయితీ ప్రకారం జనవరి నుంచి పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుందని, సంక్షేమ పథకాలకు నిధుల విడుదలకు ఇబ్బందులు ఉండకపోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. నిధుల సమీకరణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, రైతుభరోసాకు ఇవ్వడానికి ఇబ్బందులేమీ ఉండవని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి.



## యాదాద్రి బ్రహ్మోత్సవాలకు వేళాయె..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

వచ్చే ఏడాది మార్చిలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు ప్రారంభించింది. మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో దేశ విదేశాలతో పాటు స్థానిక భక్తులను మమేకం చేయనున్నారు. బ్రహ్మోత్సవాలకు తలమానికంగా ఉండేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నారు.

**స్వస్తివచనంతో ప్రారంభం**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 1న స్వస్తి వచనంతో ప్రారంభమై.. డోలోత్సవంతో ముగుస్తాయి. ఈ సందర్భంగా సాహితీ, సాంస్కృతిక, ధార్మిక సభా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 7న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఎదుర్కోలు, 8న స్వామి అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం, 9న దివ్యవిమాన రథోత్సవం, 10 న పూర్ణాహుతి, చక్రతీర్థం, దోపు ఉత్సవం, 11న శతఘటాభిషేకం, డోలోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

**గ్రామోత్సవం పేరుతో రథోత్సవం**

యాదగిరిగుట్ట, పరిసర ప్రాంత భక్తుల కోసం గ్రామోత్సవం పేరుతో కొండ కింద ప్రత్యేక రథోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా కొండపైన జరిగే రథోత్సవం అనంతరం కొండ కింద భక్తుల కోసం ప్రత్యేక రథోత్సవం నిర్వహించడానికి దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. సాంస్కృతిక కార్యక్రమాలు బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులను అలరించేలా సాంస్కృతిక, సాహితీ, సంగీత, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నారు. ఈ విషయంలో దేవస్థానం ఈవో ఎ.భాస్కర్‌రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మూడు రోజుల పాటు మహాసహస్ర అవధాని పద్మశ్రీ గరికపాటి నర్సింహారావు ప్రవచనాలు వినిపించనున్నారు. మార్చి 6న సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేశ్ సంగీత విభావరి ఏర్పాటు చేశారు.




## చట్టం ముందు అందరూ సమానులే: డీజీపీ జితేందర్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

చట్టం ముందు అందరూ సాధారణ పౌరులేనని, నటులు అల్లు అర్జున్, మోహన్‌బాబు కూడా ఇందుకు అతీతులు కారని రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని ఆదివారం ఆయన మహిళా భద్రతా విభాగం డీఐజీ రెమా రాజేశ్వరితో కలసి ప్రారంభించారు. భరోసా కేంద్రంలోని అన్ని విభాగాలను పరిశీలించారు.

బాలికలు, మహిళల భ ద్రత కోసం ప్రతి జిల్లాలో భరోసా కేంద్రాలు ఏర్పా టు చేస్తున్నామని, ఇప్పటికే రాష్ట్రంలోని 23 ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ప్రారంభించామని వివరించారు. ఈ కేంద్రాలు కేవలం తెలంగాణలోనే ఉన్నా యని, వీటి పనితీరును సుప్రీంకోర్టు కూడా అభినందించిందని గుర్తు చేశారు. ఈ కేంద్రాలు పోక్సో కేసుల దర్యాప్తులో సహాయపడతాయని, నిందితులకు శిక్ష పడే శాతాన్ని పెంచుతాయని డీజీపీ చెప్పారు. బాధితులు, మద్దతుదారులకు భద్రత కల్పించడంతోపాటు సాక్ష్యాలను సేకరించి కోర్టులో నిందితులకు శిక్ష పడేలా ఈ కేంద్రాలు కృషి చేస్తాయన్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించేలా పనిచేస్తుందని అన్నారు. ఎఫ్ఐఆర్ మొదలు.. తుది పరిష్కారం వరకు భరోసా కేంద్రం బాధితులకు బాసటగా నిలుస్తుందన్నారు. కాగా, కరీంనగర్ భరోసా కేంద్రంలో నియామకాలు చేపట్టామని, ఇక్కడ సేవలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ సీపీ మహంతి, శిక్షణ ఐపీఎస్ వసుంధరాయాదవ్, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, భరోసా కేంద్రం ఏసీపీ మాధవి, ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**బౌన్సర్లూ.. హద్దు దాటొద్దు**

సినిమా తారలు, ఇతర ప్రముఖులకు రక్షణగా ఉండే బౌన్సర్లు, ప్రైవే టు బాడీగార్డులు.. చట్టాన్ని అతిక్రమిస్తే చర్య లు తప్పవని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. బౌన్సర్లు, బాడీగార్డుల పేరిట.. చట్టానికి వ్యతిరేకంగా ఇతరులపై దాడులు, బెదిరింపులకు పాల్పడితే క్రిమినల్ కేసులతోపాటు జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ఇలాంటి బౌన్సర్లు, బాడీగార్డులు, వీరిని సమకూర్చే సంస్థలు ప్రభుత్వ, పోలీస్ నిబంధనలకు లోబ డి చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ మేరకు తెలంగాణ పోలీస్ అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక ట్వీట్ పెట్టారు.




## దరఖాస్తుల జోరు.. పరీక్షకు రారు!

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు వెలువడగానే దరఖాస్తులు పోటెత్తుతున్నాయి. వందల్లో పోస్టులు ఉంటే లక్షల మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ పెద్ద సంఖ్యలో అర్హత పరీక్షలకు గైర్హాజరవుతున్నారు. ఏళ్లుగా ఉద్యోగ నియామకాల కోసం ఎదురు చూస్తూ, సన్నద్ధమవుతున్నవారు కూడా ఇందులో ఉంటున్నారు. కనీసం హాల్‌టికెట్లు కూడా డౌన్‌లోడ్ చేసుకోనివారూ ఉన్నారు.

భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో పోటీ విపరీతంగా ఉందనే ఆందోళనతో కొందరు పరీక్షలకు దూరమవుతుండగా.. నోటిఫికేషన్ నాటి నుంచి అర్హత పరీక్షలు పూర్తయ్యే నాటికి సుదీర్ఘకాలం పడుతుండటం.. కొన్ని సందర్భాల్లో పరీక్షలు వాయిదా పడుతుండటం.. ఆలోగా దరఖాస్తుదారులు ఏదో ఓ ఉద్యోగంలో చేరి బిజీ అయిపోవడం వంటివి దీనికి కారణంగా నిలుస్తున్నాయి. అత్యంత కీలకమైన కొలువులుగా భావించే గ్రూప్-1, 2, 3, 4 ఉద్యోగాల విషయంలోనూ పరిస్థితి ఇలాగే ఉండటం గమనార్హం.

**సాగదీతలు.. వాయిదాలతో..**

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో దాదాపు 11 వేల గ్రూప్ ఉద్యోగాల భర్తీ కోసం 2022లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్లు జారీ చేసింది. 2022 ఏప్రిల్‌లో 503 గ్రూప్-1 ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీకాగా.. రెండు సార్లు ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించాక ఆ నోటిఫికేషన్ రద్దయింది. దాని స్థానంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో 563 పోస్టులతో మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో దరఖాస్తు చేసుకున్న వారిని కొనసాగిస్తూనే... కొత్త అభ్యర్థుల నుంచి కూడా దరఖాస్తులను స్వీకరించింది. దాదాపు రెండున్నరేళ్ల పాటు సాగిన ఈ గ్రూప్-1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇప్పుడు చివరిదశకు చేరింది. ఇక గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లు కూడా 2022 డిసెంబర్‌లో వెలువడ్డాయి. గ్రూప్-4 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇటీవలే పూర్తికాగా.. గ్రూప్-2, 3 పరీక్షలు పూర్తయ్యాయి. ఇందులో గ్రూప్-2 అర్హత పరీక్షలు మూడుసార్లు వాయిదా పడగా.. గ్రూప్-3 పరీక్షలు రెండుసార్లు వాయిదా పడ్డాయి. ఇలా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఏళ్ల తరబడి సాగుతుండటంతో అభ్యర్థుల్లో ఉత్సాహం తగ్గిపోతుందని.. వాటికోసం వేచి చూసే బదులుగా ప్రత్యామ్నాయ ఉద్యోగాల వైపు చూస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

**హాజరుశాతం.. క్రమంగా పతనం..**

గత ఏడాది జూలైలో గ్రూప్-4 పరీక్షలు జరిగాయి. ఒకే రోజు రెండు సెషన్లలో ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 9.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. హాజరైనవారు సుమారు ఏడున్నర లక్షల మంది మాత్రమే. అంటే 80 శాతం మందే పరీక్షలు రాశారు. ఇక గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరైనవారు 74 శాతమే.

ప్రిలిమినరీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిలో నుంచి.. ఒక్కో పోస్టుకు 50మంది చొప్పున మెయిన్స్‌కు 31,403 మందిని కమిషన్ ఎంపిక చేసింది. బాగా ప్రిపేరైన వారే మెయిన్స్‌కు ఎంపికవుతారు. అలాంటి మెయిన్స్‌కు కూడా 67.17శాతం మందే హాజరవడం గమనార్హం. గ్రూప్-3 పరీక్షలకు కేవలం 50.24 శాతం మంది, గ్రూప్-2 పరీక్షలకు మరీ తక్కువగా 45.57 శాతమే హాజరయ్యారు.

ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మారాలి ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రక్రియ ఆశాజనకంగా ఉండటం లేదు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు ఉంటున్నా క్రమం తప్పకుండా భర్తీ చేయడం లేదు. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులు నిరాశలో కూరుకుపోతున్నారు. పైగా నోటిఫికేషన్లు జారీ చేశాక పరీక్షల నిర్వహణ, వాయిదాలతో సుదీర్ఘ జాప్యం జరుగుతోంది. దరఖాస్తు చేసినవారు పరీక్షల నాటికి ఇతర ఉద్యోగాల వైపు వెళ్తున్నారు. దీనితో దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తుండగా.. హాజరు అంతంత మాత్రంగానే ఉంటోంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే క్రమం తప్పకుండా నోటిఫికేషన్లు జారీ చేస్తూ.. భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలి.



## ప్రతి 35 కిలోమీటర్లకు ఒకటి..

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో మరణాలను నివారించేందుకు ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆదివారం ఆయన నిజామాబాద్ జిల్లా రెంజల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మా ట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా 300 వరకు హెల్త్ సబ్‌సెంటర్లు, 170 వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో కేన్సర్ చికిత్స కేంద్రాలతో పాటు వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్‌లను త్వరలో ప్రారంభిస్తామన్నారు.

జీజీహెచ్‌లో ఏం జరుగుతోందో నాకు తెలుసు..

'నిజామాబాద్‌లోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో ఏం జరుగుతోందో నాకు తెలుసు. 60 శాతం మంది వైద్యులు విధులకు గైర్హాజరు అవుతున్నారు. నా వద్ద పూర్తి సమాచారం ఉంది'అని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్‌గా ప్రాక్టీస్ చేస్తే చర్య లు తప్పవని హెచ్చరించారు. వంద రోజుల్లో మళ్లీ వస్తానని, అప్పటిలోగా మార్పు రాకుంటే కఠిన చర్యలు ఉంటాయ న్నారు.

ఆదివారం ఆయన జీజీహెచ్‌ను సందర్శించారు. ఆస్పత్రిలో పైపులైన్ లీకేజీ, భవనాలపై పిచ్చిమొక్కలు పెరగడం, కిటికీల అద్దాలు పగిలిపోవడం, లిఫ్ట్‌లు చెడిపోవడం, ఎలు కలు తిరుగుతుండటాన్ని గమనించి సూపరింటెండెంట్ ప్రతి మారాజ్‌పై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జీజీహెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధి కోసం రూ. 7 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమాలలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేశ్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు పాల్గొన్నారు.



## 'మత్తు'రహిత వేడుకలు

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

నూతన సంవత్సర (2025) వేడుకలు మాదక ద్రవ్య రహితంగా జరిగేలా చూడటమే లక్ష్యంగా తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) పటిష్ఠ చర్యలు ప్రారంభించింది. వేడుకల్లో మత్తుపదార్థాల వినియోగాన్ని కట్టడి చేసేందుకు టీజీఏఎన్‌బీ బృందాలు నిఘా పెంచాయి. తనిఖీలు ముమ్మరం చేయడంతోపాటు మత్తు పదార్థాలు విక్రయించే, సరఫరా చేసే వారిపై ఫోకస్ పెంచినట్టు అధికారులు తెలిపారు.

**రంగంలోకి 266 పోలీస్ స్నిఫర్ డాగ్స్**

స్థానిక పోలీస్, ఎక్సైజ్, టీజీఏఎన్‌బీ అధికారుల సోదాలు ముమ్మరం కావడంతో డ్రగ్స్, గంజాయి ముఠాలు కొత్త ఎత్తులు వేస్తున్నాయి. అధికారులకు పట్టుబడకుండా వాహనాల్లోని రహస్య ప్రదేశాల్లో దాచి డ్రగ్స్, గంజాయి రవాణా చేస్తున్నాయి. ట్రాక్టర్లు, బస్సుల్లో, సీఎన్జీ వాహనాల్లోని సిలిండర్లలో, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ అనిపించేలా ఉండే డబ్బాలలో..ఇలా రకరకాల పద్ధతులలో పోలీసుల కన్నుగప్పి రవాణా చేస్తున్న మాదక ద్రవ్యాలను పోలీసులు గతంలో స్వాధీనం చేసుకున్నారు. నిరుద్యోగులైన యువతుల్ని కూడా డ్రగ్స్ రవాణా కోసం మాఫియా వినియోగిస్తోంది. ఇలాంటి ముఠాలపై పటిష్టమైన నిఘా వేయడంతో పాటు ఇన్‌ఫార్మర్ వ్యవస్థతో మత్తు ముఠాల ఆటకు టీజీఏఎన్‌బీ కృషి చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్ యూనిట్లలో కలిపి 266 పోలీసు జాగిలాలకు మాదకద్రవ్యాల గుర్తింపు శిక్షణ ఇచ్చింది. వాటి ద్వారా డ్రగ్స్ రవాణాను సమర్థంగా అడ్డుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల వరంగల్ రైల్వే స్టేషన్లో స్నిఫర్ డాగ్‌తో తనిఖీ చేస్తుండగా..అక్కడికి వంద మీటర్ల దూరంలో ఉన్న ఒక ఇంటి మొదటి అంతస్తులో గంజాయి మొక్కలను కుండీలలో పెంచుతున్న విషయాన్ని ఈ స్నిఫర్ డాగ్ గుర్తించిందని చెప్పారు. టీజీఏఎన్‌బీ తీసుకుంటున్న చర్యలను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రశంసించినట్టు తెలిపారు.

**ఇటీవల గుర్తించిన మరికొన్ని కేసులు**

గంజాయి చాక్లెట్లతో స్కూలు విద్యార్థులను, దినసరి కూలీలను టార్గెట్ చేస్తున్న ముఠాలను రాజస్తాన్ వరకు వెళ్లి పట్టుకోవడమే కాకుండా తయారు చేస్తున్న ఫ్యాక్టరీని కూడా అక్కడి అధికారుల సహాయంతో టీజీఏఎన్‌బీ మూయించగలిగింది.

## పుష్ప తగ్గాల్సిందే.. కాంగ్రెస్ నేతల వార్నింగ్..!

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట.. రేవతి అనే మహిళ మృతి.. శ్రీతేజ్ అనే బాలుడు మృత్యువుతో పోరాటం.. వీటన్నింటికి కారణం అల్లు అర్జునే.. అతను రావడం వల్లే ఇదంతా జరిగింది అంటూ శాసనసభ సాక్షిగా ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి. అయితే తన తప్పేం లేదని.. జరిగింది ఓ ప్రమాదం అంటున్నారు అల్లు అర్జున్. మరి ఇందులో ఎవరి మాట నిజం? ఎవరి మాట అబద్ధం?

అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టడంపై కాంగ్రెస్ నేతలు ఫైర్ అవుతున్నారు. ఇంత జరిగిన తర్వాత కూడా అల్లు అర్జున్ తప్పు తెలుసుకోవడం లేదని.. ఇప్పటికీ తాను చేసింది కరెక్టే అనే తీరులో ఆయన మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లు అర్జున్ ధ్యాసంతా సినిమా కలెక్షన్స్ మీద తప్పా బాధిత కుటుంబం మీద కాదంటూ మండిపడ్డారు.

అల్లు అర్జున్ వ్యవహారం శైలి దారుణంగా ఉందని మండిపడ్డారు ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్. అల్లు అర్జున్‌కు పశ్చాత్తాపం కనిపించలేదన్నారు. రేవతి కుటుంబంపైన అల్లు అర్జున్ కనీస సానుభూతి చూపించడం లేదని సీరియస్ అయ్యారు ఆదిశ్రీనివాస్. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన మాటలను తప్పు పట్టాలా అల్లు అర్జున్ తీరుందన్నారు. ఇద్దరు చనిపోయారన్నా అల్లూ అర్జున్ రోడ్ షో చేయడం కరెక్ట్ కాదని.. వ్యక్తిగత ప్రతిష్ట గురించే తప్ప చనిపోయిన వారిపట్ల ఎలాంటి సింపతి లేదని ఆగ్రహించారు ఆది శ్రీనివాస్.

సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటనపై హీరో అల్లు అర్జున్ పట్టన్నట్లు వ్యవహరించడం దారుణమని బిల్యా నాయక్ అన్నారు. తొక్కిసలాటలో చనిపోయిన వారి గురించి మాట్లాడకుండా... తాను సినిమాకోసం కష్టించిన కష్టాన్ని గుర్తించడం సరైంది కాదన్నారు.పుష్ప 2 ఘటనపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు రియాక్ట్ అయ్యారు. ఫ్యాన్స్ ఎక్కువ మంది వస్తారని తెలిసినప్పుడు.. అలాంటి సమయంలో హీరో థియేటర్ దగ్గరికి వెళ్లకపోవడమే మంచిదన్నారు. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరించాలని అన్నారు. ఇప్పుడంతా ఆలోచించాల్సింది. ఇలాంటి పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. అంతేకాకుండా బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

## హీరో అయితే సో వాట్.. చట్టం అందరికీ ఒక్కటే..

○ మహేష్ గౌడ్

**హైదరాబాద్ ,తెలంగాణ ముచ్చట్లు:**

హీరో అల్లు అర్జున్ నిన్న మీడియా సమావేశంలో చేసిన ప్రకటనలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్న పరిస్థితి తెలిసిందే. తాజాగా అల్లు అర్జున్ పై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన కామెంట్స్ చేశారు. సినిమా హీరో అంతమాత్రాన ఎవరి ప్రాణాలనైనా తీసే హక్కు ఉందా అంటూ మహేష్ గౌడు నేరుగా అల్లు అర్జున్ ను ప్రశ్నించారు.

నిజామాబాద్ పర్యటనలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదివారం బన్నీని ఉద్దేశించి మాట్లాడారు. మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. పేద కుటుంబానికి చెందిన మహిళ చనిపోతే లేని బాధ, అల్లు అర్జున్ కేసు విషయానికి సంబంధించి అందరూ హీరోకు సానుభూతిగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. అల్లు అర్జున్ పై అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరు సమంజసంగా ఉందని, ప్రజల్లో ప్రభుత్వం పై వస్తున్న పలు అనుమానాలను సీఎం నివృత్తి చేశారన్నారు.కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన విమర్శలపై మహేష్ గౌడ్ శివాలెత్తారు. అల్లు అర్జున్ కు మద్దతుగా బండి సంజయ్ మాట్లాడిన తీరును తప్పు పట్టిన మహేష్ గౌడ్, సినీ పరిశ్రమపై తమకు కూడా ప్రేమ ఉందని, కానీ ప్రజల ప్రాణాలు ముఖ్యమన్న విషయాన్ని బండి సంజయ్ మరిచిపోయారన్నారు. ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని, సంధ్యా థియేటర్ తొక్కిసలాటలో ఒక మహిళ మృతి చెంది, అభం శుభం తెలియని పాపకు తల్లి దూరమైందన్న విషయాన్ని కూడా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు.




చిత్ర పరిశ్రమ అంటే కాంగ్రెస్ పార్టీకి అభిమానం ఉందని, మెగాస్టార్ చిరంజీవికి కేంద్రం మంత్రి పదవి ఇచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీనన్న విషయాన్ని టాలీవుడ్ పెద్దలు గుర్తించాలన్నారు. సినీ ఇండస్ట్రీ మద్రాస్ నుండి హైదరాబాద్ రావడానికి ప్రధాన కారణం కూడా కాంగ్రెస్ పార్టీగా వర్ణించిన మహేష్ గౌడ్, తమకు ఏ వ్యక్తులపై ద్వేషాలు ఉండవని, ప్రభుత్వం దృష్టిలో అందరూ సమానమే అంటూ మాట్లాడారు. ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, చట్టానికి ఎవరు అతీతులు కారన్నారు.

ఇక ఫార్ములా ఈ రేసింగ్ కేసు కు సంబంధించి మహేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లపాటు ఏదేక్షగా దోచుకున్న కుటుంబం కెసిఆర్ కుటుంబమంటూ విమర్శించారు. ఫార్ములా ఈ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ అడ్డంగా దొరికిపోయారన్నారు. మొన్నటి వరకు జైలుకు వెళ్లేందుకు కూడా తాను సిద్ధమంటూ చెప్పిన కేటీఆర్, ఇప్పుడు కోర్టును ఆశ్రయించడం మరెందుకంటూ మహేష్ గౌడ్ ప్రశ్నించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# జాలీ ప్రేమ కరుణకు ప్రతి రూపం జీసస్ క్రీస్తు

- ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన జావేద్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

జీసస్ క్రీస్తు అంటే జాలీ ప్రేమ కరుణకు ప్రతి రూపం అని నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్ తెలిపారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో నగర్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు పేరం యశ్వంత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. అనంతరం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావేద్ మాట్లాడుతూ... జీసస్ క్రీస్తు బోధనలు జాలీ దయా ప్రేమ కరుణతో కూడి ఉంటాయని అదే విధంగా కాంగ్రెస్ పార్టీ కూడా ప్రతి ఒక్కరి పట్ల ప్రేమ, జాలీ, దయా కరుణతో ఉంటుందని అన్నారు. నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతి వారం బాధితుల నుండి వినతులు స్వీకరించి ముగ్గురు మంత్రుల ద్వారా ఆయా శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఒక బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. డివిజన్ స్థాయి అధ్యక్షులు వినతులు స్వీకరించి వాటికి తగు పరిష్కారాలు అయ్యే విధంగా కృషి చేస్తారనీ అన్నారు. ప్రజలు తప్పుడు ఆరోపణలు నమ్మొద్దని ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి పక్ష నాయకులు ప్రభుత్వాన్ని విమర్శించడమే పని గా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. జిల్లా ముగ్గురు మంత్రులు సారథ్యంలో అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. ఏ ఒక్కరికీ కష్టం వచ్చినా నగర కాంగ్రెస్ వారికి అండగా ఉండి సమస్యను ప్రభుత్వం దృష్టికి పోయేలా కృషి చేయడం జరుగుతుందని అన్నారు. జీసస్ జీవితం జాలీ దయా ప్రేమ కరుణకు ప్రతికగా అని అన్నారు. ప్రతి ఒక్కరిపై జాలీ దయా ప్రేమ చూపించాలనేదే జీసస్ సిద్ధాంతం అని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే సిద్ధాంతంతో ముందుకు పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఈ కార్యక్రమంలో 2 వ డివిజన్ కార్పొరేటర్ మలిదు వెంకటేశ్వర్లు, 8వ డివిజన్ కార్పొరేటర్ లాకవత్ సైదులు, 49 వ డివిజన్ కార్పొరేటర్ దుద్దుకురి వెంకటేశ్వర్లు, మైనారిటీ రాష్ట్ర కన్వీనర్ బిహెచ్ రబ్బానీ, సేవదల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు విప్లవ్ కుమార్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉప అధ్యక్షులు కొంటేముక్కల నాగేశ్వరరావు, నల్లమల సత్యం బాబు, బీసి సెల్ నగర అధ్యక్షుడు బాణాల లక్ష్మణ్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఆనందరావు, వేజెండ్ల సాయి కుమార్, గజ్జి సూర్యనారాయణ, బండి మాధవ రావు, ముక్రం, జాని, శ్రీశైలం, చల్ల ప్రతిభ రెడ్డి, భూక్యా సురేష్, డివిజన్ అధ్యక్షులు షేక్ వసీం, సయ్యద్ మహమూద్, సత్యాల వెంకటేశ్వర్లు, నాగటి చంద్రం, కందుల శ్రీను, కొలికపొంగు రమేష్ బండి నాగేశ్వరరావు, షేక్ రజి, బోజెడ్ల సత్యనారాయణ, ఫరీద్ ఖాద్రీ, భూక్యా రమేష్, యడవల్లి వీరయ్య, ఆర్కే కటబతిని, పర్వత శ్రీను, వేస్త చలపతి అజ్మీరా ఉపేందర్, వెంకటేశ్వర్లు, షేక్ జాహిర్, తెజవత్ సక్రు, పాషా, పాల్గొన్నారు.

# నగరంలోని పలు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చూసేందుకు నగరంలోని పలు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఏసీపీ రవి ఆధ్వర్యంలో గంజాయి సేవించేందుకు అడ్డాలుగా చేసుకున్నట్లు భావిస్తున్న పలు ప్రాంతాలలో నిఘా పెట్టిన టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం , ఆదివారం లలో అయా ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాలతో పాటు అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం పలు ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ పేర్కొన్నారు. ఇకపై కూడా ఇలాంటి ఆకస్మిక దాడులు కొనసాగుతాయని తెలిపారు. నిషేధిత గంజాయి లాంటి మత్తు పదార్థాలను విక్రయించడం, సరఫరా చేయడం లాంటివి చేస్తే అలాంటి వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయికి బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల నడవడికను, అలవాట్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు. గంజాయి సేవించే అడ్డాల తో పాటు నగరంలోని రోటరీ నగర్ ట్యాంక్, ఎస్బిఐటి కళాశాల పరిసరాలు, మమత వైద్య కళాశాల పరిసరాలు, శాంతి నగర్ పాఠశాల పరిసరాలు, చర్చి కంపౌండ్ , జహీర్‌పురా పార్క్ పరిసరాలు, ప్రకాష్ నగర్ , ఎన్టీఆర్ సర్కిల్ , కొత్త బస్టాండ్, గట్టయ్య సెంటర్ , సరిత క్లినిక్, సారథి నగర్ దిగువ రైల్వే వంతెన, గొల్లగూడెం పరిసరా ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.



# అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి


- అఖిలపక్షం డిమాండ్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

మధిర స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం నుండి కాంగ్రెస్ సిపిఎం సిపిఐ ఆధ్వర్యంలో అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అనంతరం అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బెజవాడ రవిబాబు మాట్లాడుతూ భారత ప్రజలకు దళిత గిరిజన బహుజన పేద మహిళ నా హక్కుల కోసం నిరంతరం పోరాడి వారికి అండగా నిలిచిన మహనీయుని అవమానపరచడం అంటే భారత ప్రజలను అవమానపరిచినట్టేనని అన్నారు. మనువాద భావజాలంతో కళ్ళు మూసుకుపోయిన అమిత్ షాకు భారత రాజ్యాంగం అన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పేరు చెప్పిన ఇష్టం ఉండదని అందుకే అంబేద్కర్ను అవమాన పరుస్తూ భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని దీని ప్రజలంతా గమనించి తిప్పి కొట్టాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ ప్రదర్శన కార్యక్రమంలో కాంగ్రెస్ సిపిఎం సిపిఐ పార్టీ కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు సిపిఎం పార్టీ నుండి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీల నరసింహారావు మందా సైదులు పడకంటి మురళి తేలపోలు రాధాకృష్ణ మాజీ పట్టణ కార్యదర్శి మండవ పనింద్ర కుమారి కాంగ్రెస్ పార్టీ నాయకులు చావా వేణు రంగా హనుమంతరావు అద్దంకి రవి కర్నాటి రామారావు అద్దంకి రవి దుంప వెంకటేశ్వర్ రెడ్డి నిడమానూరు వంశీకృష్ణ చిలువేరు బుచ్చి రామయ్య ధారా బాలరాజు చిట్టిబాబు సిపిఐ నాయకులు ఓట్ల కొండలరావు పెరుమాళ్ళపల్లి ప్రకాష్ రావు అన్నవరపు సత్యనారాయణ చావా వెంకటేశ్వరరావు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు

# రుధిర ధార పుస్తక సమీక్ష

## అన్యాయాలపై అక్షర సమరం




**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

"పీడిత ప్రజల రక్షణ కోసం మీరెందుకు పోరాడరు?" అని ఖుర్ ఆన్ మనల్ని ప్రశ్నిస్తుంది. కానీ కవయిత్రి బతూల్ హుమైర్వీ అందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. భారత్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా పేదలు, యుద్ధ బాధితులు, మైనారిటీలు, రైతులు, మహిళల కష్టాలకు కారణమైన వారిని తన కవితలతో ధైర్యంగా ప్రశ్నిస్తారు. వివిధ అమానవీయ సందర్భాల్లో తన ఆవేదనకు, ఆలోచనలకు కవితల రూపం ఇచ్చారు. తాను చెప్పాలనుకున్న భావాలను గుండెకు హత్తుకొనేలా పదునైన పదాలతో అక్షీకరించారు. "అన్యాయాలపై ధ్వజమెత్తే ధీర వనితలు లేనంత వరకు" ఆడపిల్లల ఆయువుకు రక్షణ ఉండదని ఓ కవితలో హెచ్చరించారు. స్వేచ్ఛా గీతిక కవితలో "నా పరదా జాత్యాంహకారులపై నిరసన జెండా!" అంటూ కర్ణాటకలో హిజాబ్ నిషేధాజ్ఞలపై తన కోపాన్ని ఎలుగెత్తి చాటారు. అయితే భద్రత పేరిట అభద్రతను నెలకొల్పే కుటిల కుట్రలను ఎదుర్కోవడం ఎలాగో అని ప్రభుత్వ చర్యలపై ఆందోళన చెందారు. పోలీసుల కాల్పుల మోతలు రైతులను బెదిరించ లేవని.. అవి వారిని కర్తవ్యోన్ముఖుల్ని చేస్తున్నాయని ఇంక్విలాబ్ కవితలో వర్ణించారు. ఉద్యమ స్ఫూర్తిలో దేశానికి ఆదర్శంగా నిలిచిన రైతులను "పట్టు వీడని విక్రమార్కుల"ని కీర్తించి వారికి సలాం చేశారు. "కుట్ర మీకు మతమైంది.. అవి తెలియక వాటికి బలైంది మేమే!" అని కాషాయ శక్తుల అధికార మతోన్మాదానికి శోకిస్తారు. "దేశమంటే మానవత్వం" అని సరికొత్త అర్థాన్ని ఇచ్చి "మనువాదానికి మానవత్వం నేర్పుదాం రండి!" అని పిలుపునిచ్చారు. దేశ దిమ్మరులకు ఆశ్రయం ఇచ్చిన పాపానికి ప్రాయశ్చిత్తమిది...అని పలస్తీనాఇజ్రాయెల్ యుద్ధం పట్ల విచారం వ్యక్తం చేశారు. వాస్తవానికి బతూల్ హుమైర్వీ "రుధిర ధార" కవితా సంకలనం ఇస్లాం వాద కవిత్వమే కాదు... అభ్యదయ ప్రపంచాన్ని కోరే మానవవాద సాహిత్యం. బడుగుల కష్టాలను ఆమె వర్ణించిన తీరు, మతోన్మాద శక్తులను ప్రశ్నించిన పద్ధతి మానవత్వం ఉన్నవారిని కదిలిస్తాయి.. కర్తవ్యోన్ముఖుల్ని చేస్తాయి.

**ముహమ్మద్ ముజాహిద్,**
**9640622076**



# ప్రముఖ న్యాయవాది స్వామి రమేష్ తండ్రికి ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి ఘన నివాళి

- స్వామి గురునాథం అంత్యక్రియల్లో పాల్గొన్న రామ సహాయం

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

నగరంలోని ప్రముఖ న్యాయవాది స్వామి రమేష్ కుమార్ తండ్రి స్వామి గురునాథం మృతి చెందగా.. ద్వారకా నగర్ లోని వారి నివాసానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి వెళ్లి.. మృతదేహం వద్ద ఘన నివాళులర్పించారు. స్వామి రమేష్ ను పరామర్శించి.. వివరాలు తెలుసుకున్నారు. స్వామి గురునాథం సతీమణి ఏసు లక్ష్మి, కుమారులు స్వామి అచ్యుతరావు, వెంకట్రావ్, రవికుమార్ లను ఓదార్చారు. దశాబ్దాల కాలం నుంచి వీరి కుటుంబంతో స్నేహం ఉందని, మంచి వ్యక్తిని కోల్పోయామని ఈ సందర్భంగా ఎంపి రఘురాంరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

**మంత్రి తుమ్మలతో కలిసి ఎంపీ పరామర్శ**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుతో కలిసి ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి.. స్వామి రమేష్ కుమార్, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్వామి గురునాథం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో..కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ప్రముఖ న్యాయవాది ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, నాయకులు నెల్లూరి భద్రయ్య, షేక్ ఖాజామీయా, తదితరులు పాల్గొన్నారు.





# డివిజన్ అభివృద్ధికి కృషి చేయండి

- మంత్రి తుమ్మల

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

కాంగ్రెస్ పార్టీ లో చేరిన కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ దంపతులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ ను అభివృద్ధి పథంలో నడిపించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునకొల్లు నీరజ, డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ , కార్పొరేటర్లు కమర్తపు మురళి, మలీదు వెంకటేశ్వర్లు , లకావత్ సైదులు నాయకులు సాధు రమేష్ రెడ్డి గారు, పాలెపు వెంకటరమణ, డివిజన్ అధ్యక్షుడు షేక్ రజ్జి, నాయకులు బాల్దె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం గాలా నైట్స్ ఈవెంట్స్ పోస్టులను ఆవిష్కరించిన యువ నాయకులు మాటేటి కిరణ్ కుమార్

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

ఈనెల 31వ తారీఖు టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ లో ఖమ్మం గాలా నైట్స్ పేరుతో నిర్వహించబడే ఈవెంట్స్ పోస్టులను యువ నాయకులు మాటేటి కిరణ్ కుమార్ చేతుల మీదుగా నిర్వాహకులు ఆవిష్కరించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ గాలా నైట్స్ ఈవెంట్స్ నాన్ స్టాప్ మ్యూజిక్ , ఫుడ్ స్టాల్స్ , ఫన్ & ఎంటర్టైన్మెంట్ విత్ డాల్స్ లైవ్ పెర్ఫార్మన్సెస్ , లైవ్ దాండియా పెర్ఫార్మన్సెస్ వంటి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం నిర్వాహకులు వియూకే ప్రాంక్స్ ఉపేందర్ , సాయి కళ్యాణ్ , నజీర్ , ఖమ్మం అప్డేట్స్ పవన్ , బలరాం , దీపక్ , ప్రవీణ్ , గండికోట ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు .



# కలెక్టరేట్ లో అధికారికంగా జి. వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమం

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం అధికారికంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. కళావతి బాయి, ఇడి ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కె. శ్రీనివాసరావు తదితరులు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, సుదీర్ఘ కాలం పాటు కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యునిగా దేశానికి సేవలు అందించిన వెంకటస్వామి దళిత, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారని, ఆయన సేవలను గుర్తిస్తూ నిరంతరం స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తోందని అన్నారు. స్వర్గీయ వెంకటస్వామి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముక్కోటి ఉత్సవాలకు రండి

- జిల్లా కలెక్టర్ కు ఈవో ఆహ్వానం

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**

జనవరి 9,10 తేదీల్లో జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు ప్రత్యేక అతిథిగా హాజరుకావాలని భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈవో రమాదేవి ఆదివారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ను ఐడీఓసీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ అర్చకులు జిల్లా కలెక్టర్ కు ఆహ్వాన పత్రిక అందించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ భద్రాచలం ఆలయ ఈవోను ముక్కోటి ఉత్సవాల సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. భక్తులకు తాగునీరు, వసతి, వైద్య, భద్రత సదుపాయాలు వంటివి అందుబాటులో ఉంచాలని చెప్పారు. ముక్కోటి వేడుకల ఏర్పాట్లు భక్తులు మెచ్చేలా ఉండాలన్నారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని సూచించారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు
- సంక్రాంతి నుంచి ఇండ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు
- నగరానికి నీటి సరఫరా కోసం 220 కోట్లతో అమృత్ ద్వారా పనులు
- మున్నేరు నదికి రెండు వైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి నిపుణుల కమిటీ ఏర్పాటు



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఆదివారం మంత్రి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 57 వ డివిజన్ రమణ గుట్టలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి. నిధులు 85 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు, రోడ్డుకు భూమి ఇచ్చిన మదన్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రోడ్డు నిర్మాణం బాగా ఉంటే భూముల ధరలు పెరుగుతాయని అన్నారు. భగవంతుడు ఇచ్చిన శక్తి మేరకు పేదలకు సహాయం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పేదలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, సంక్రాంతి నుంచి ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వం కృషి చేస్తుందని, హౌసింగ్ శాఖ మన జిల్లా మంత్రి దగ్గర ఉంది కాబట్టి ఖమ్మంలో అధికంగా కేటాయింపు ఇవ్వాలని, నగరంలో జనాభా పెరిగిందని పేదలు ఎక్కువగా ఉన్నారని, ఇక్కడ అధికంగా మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. రాబోయే 4 సంవత్సరాలలో పేదలకు గతంలో లాగా కాలనీలలో ఇండ్లు నిర్మించి అందించడం జరుగుతుందని అన్నారు. పేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందకపోతే స్థానిక ప్రజాప్రతినిధులు, కమీషనర్ ని కలవాలని, అర్హులందరికీ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నగరానికి నీటి సరఫరా కోసం 220 కోట్లతో అమృత్ క్రింద పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఖమ్మం నగరంలో వరదల కారణంగా ముంపు రాకుండా ఉండేందుకు పనులు చేపట్టేందుకు 250 కోట్లు మంజూరు చేసామని, త్వరలో పనులు ప్రారంభించి రాబోయే వర్షాకాలంలో అటువంటి పరిస్థితులు రాకుండా చర్యలు తీసుకుంటు న్నామని అన్నారు. మున్నేరుకు రెండు వైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, మొన్న వచ్చిన వరదలను దృష్టిలో పెట్టుకుని నూతనంగా నిపుణుల కమిటీచే అంచనాలు తయారు చేస్తున్నామని అన్నారు.డంపింగ్ యార్డ్ రోడ్డు విస్తరణ కోసం కోటి 15 లక్షలు మంజూరు చేశామని అన్నారు. నగరంలో స్లాటర్ హౌస్ నిర్మాణానికి 8 కోట్లు మంజూరు చేసామని, 500 ఎకరాలలో ఉన్న వెలుగు మట్ల అర్బన్ పార్కును నెహ్రూ జూలాజికల్ పార్క్ లాగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఖమ్మం ఖిల్లా వద్ద పదిహేను, ఇరవై కోట్లు ఖర్చు పెట్టి రోప్ వే ఏర్పాటు చేయడానికి, అక్కడ కొంత సమయం ఆహ్లాదంగా గడిపే పరిస్థితులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. డివిజన్ ల వారీగా అవసరమైన చోట నూతన రోడ్లు, డ్రైయిన్లు మంజూరు చేస్తున్నామని, వీటిని నాణ్యతతో నిర్మించి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా అధికారులు పని చేయాలని అన్నారు. రహదారుల వెంబడి, ప్రభుత్వ భూములలో ఆక్రమణలు జరుగుతుంటే మొదటి స్థాయిలోనే అధికారులు అరికట్టాలని, లేనిపక్షంలో అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. నగరంలో పారిశుధ్య చర్యలు మరింత మెరుగ్గా అమలు కావాల్సిన అవసరం ఉందని, కార్పొరేటర్లు బాధ్యత తీసుకొని తమ డివిజన్ లు అందంగా తీర్చిదిద్దాలని, అవసరమైన చోట మొక్కలు ఏర్పాటు చేసి సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దాలని అన్నారు. 57వ డివిజన్ లో నూతనంగా అంగన్వాడి కేంద్రం మంజూరు చేస్తామని, ఇక్కడ అవసరమైన విద్యుత్ స్తంభాలు, అవసరమైన ప్రజలకు విద్యుత్ మీటర్లు ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు అవుతున్నాయని, ఇందిరమ్మ ఇండ్లు కూడా ప్రారంభమయ్యాయని, నిన్న కల్లూరులో ఇందిరమ్మ ఇండ్ల నమూనా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించామని అన్నారు. చక్కని ఎమ్మెల్యేను ఎన్నుకున్నారని, సమయాన్ని వృధా చేయకుండా నిరంతరం ప్రజల కోసం మంత్రి తుమ్మల పాటు పడతారని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ నేడు 750 మీటర్ల రోడ్డు నిర్మాణం, 330 మీటర్ల డ్రైయిన్ నిర్మాణ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసామని, వీటిని వారం రోజులలో ప్రారంభించి మూడు నెలలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటు లోకి తీసుకువస్తామని అన్నారు. టౌన్ ప్లానింగ్ కు సంబంధించి ఏవరైనా అక్రమ నిర్మాణాలు, పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదులు నమోదు చేసేందుకు పురపాలక కార్యాలయంలో కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 57 వ డివిజన్ అభివృద్ధి కోసం 85 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేసుకుంటామని అన్నారు. ఈ డివిజన్ లో ఉన్న సమస్యలను స్థానిక కార్పొరేటర్ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లారని, మున్సిపల్ శాఖ, ఇతర అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ యం.డి. రఫీద బేగం, కార్పొరేటర్ కమర్తపు మురళీ, ప్రజాప్రతినిధులు, పబ్లిక్ హెల్త్, మునిసిపల్ ఇంజినీరింగ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## 26న ఖమ్మంలో సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

- సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్రె రెడ్డి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

డిసెంబర్ 26న సీపీఐ శతజయంతి సందర్భంగా ఖమ్మం నగరంలో నిర్వహించే భారీ ప్రదర్శనలో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ నాగిలిగొండ గ్రామ శాఖ సమావేశం అరికొట్ల భాస్కర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జమ్ముల జితేందర్రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ పార్టీ 100వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఖమ్మంలో భారీ ప్రదర్శన, రెడ్షర్ట్ వాలింటర్ల కవాతు, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.పార్టీ శత వసంతాల సందర్భంగా అన్ని గ్రామల్లో పతాకావిష్కరణతో పాటు పార్టీ గత చరిత్రను, పార్టీ సాధించిన పోరాట విజయాలను నేటి తరాలకు తెలియజేయాలన్నారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన మోడీ కార్మిక రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారన్నారు. అమిష్టా బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానించడమంటే భారత రాజ్యాంగాన్ని, భారత ప్రజానికాన్ని అవమానించడమేనన్నారు.బీజేపీ మతం పేరుతో ఉన్మాదం సృష్టిస్తుందన్నారు. బీజేపీ భారత రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కి ఆర్టికల్ 370 సవరణ, ఫెడరల్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టిందన్నారు. దేశసంపదను కార్పొరేట్లకు దోచిపెట్టి పేదవాళ్లని బానిసలుగా మారుస్తుందన్నారు.26న జరిగే ప్రదర్శనకు భారీగా తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు వేపూరి రవీంద్రబాబు,పదిమల వెంకటనర్సయ్య, షేక్ చిన్న జాన్, వజీర్,ముఖర్జీ, చాట్ల రమేష్,పంది పుల్లయ్య, దమ్మాలపాటి శ్రీనివాస్, శేఖర్, ఏలియా, చాట్ల బాబు, వేపూరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.




## జీసస్ క్రైస్ట్ గాస్పల్ మినిస్ట్రీస్ వారి గ్రాండ్ సెమీ క్రిస్మస్ పండుగ

- పాస్టర్ బి.ఆదాం (అప్పారావు)

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

శనివారం రాత్రి జీసస్ క్రైస్ట్ గాస్పల్ మినిస్ట్రీస్ వారి సెమీ క్రిస్మస్ పండుగ పాస్టర్ బి.ఆదాం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సదాశివపురం గ్రామంలో ఘనంగా జరిగింది. క్రిస్మస్ పండుగ వస్తున్న తరుణంలో ఆయా ప్రాంతాల్లో ఆయా జిల్లాల్లో ప్రపంచంలో సెమి క్రిస్మస్ లు ఏర్పాటుచేసి ప్రజలకు సువార్త అందించడం అనేది బైబిల్ వాక్యానుసారం. ఈ సందర్భంలో సదాశివపురం గ్రామమంతా క్రిస్మస్ పండుగ వాతావరణం కనిపించింది. దాదాపుగా 200 మంది భక్తులు యొక్క సెమీ క్రిస్మస్ పండుగలు పాల్గొన్నారు. ఈ సెమీ క్రిస్మస్ లో దూర ప్రాంతం నుండి వచ్చిన దైవ సేవకులు జె.ఇశ్రాయేలు దేవుని వాక్యాన్ని అందించి ప్రజల హృదయాల్లో ఏసుక్రీస్తుని నింపారు. ఏసుక్రీస్తు ఈ లోకానికి ఎందుకు వచ్చాడు ఈ లోకానికి వచ్చి ఏమి చేశాడు పాపులను రక్షించడానికి ఏసుక్రీస్తు ఈ లోకానికి వచ్చాడనీ మంచి వర్తమానాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో క్రైస్తవ భక్తులు, పాస్టర్ బి.ఆదం సంఘ సభ్యులు పాల్గొన్నారు.




## పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించాలి

- ఎలక్ట్రోల్ అబ్జర్వర్ శ్రీ బాలమాయాదేవి

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అండ్ డిస్టిక్ మెజిస్ట్రేట్ జితేష్ వి. పాటిల్ తో కలిసి ఎలక్ట్రోల్ అబ్జర్వర్ శ్రీ బాలమాయాదేవి.స్పెషల్ సమ్మరీ రివిజన్ 20 25, పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు విచ్చేసిన ఎలక్ట్రోల్ అబ్జర్వర్ బాలమాయదేవి కి పూల మొక్క ఇచ్చి కలెక్టర్ స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఆమెకు జిల్లాలో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ ఐడి కార్డుల జారీ, పోలింగ్ కేంద్రాలలో చేసిన ఏర్పాట్లు తదితర అంశాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ సూచనల మేరకు క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు, పెండింగ్లో ఉన్న ఫామ్ 6,7,8, లను వెంటనే పరిష్కరించాలని, దివ్యాంగ ఓటర్లను, గుర్తించాలని, షెడ్యూల్ ప్రకారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని, వారి యొక్క సలహాలు, సూచనలు ఎన్నికల కమిషన్కు పంపాలన్నారు, నాణ్యమైన ఓటరు ఏపిక్ కార్డులను ప్రింట్ చేసి పంపిణీ చేయాలన్నారు, ఓటర్ అవగాహన పై స్వీప్ ఆక్టివిటీస్, స్టార్ క్యాంపైనర్స్ ద్వారా డిగ్రీ కాలేజెస్, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్ కాలేజ్ అన్ని విద్యాసంస్థలలో కార్యక్రమాలు నిర్వహించి ఓటరు నమోదు ఓటు హక్కు పై అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు,అన్ని పోలింగ్ కేంద్రాలలో, దివ్యాంగుల కోసం ర్యాంప్స్ ఏర్పాటు చేయాలని, త్రాగునీరు, మరుగుదొడ్ల, విద్యుత్ సరఫరా సౌకర్యం, అన్ని మౌలిక వసతులు ఉండే విధంగా చర్యలుతీసుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య,భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, తాసిల్దార్లు, ఎలక్షన్ సూపర్డెంట్ రంగ ప్రసాద్, మరియు బీసీ సంక్షేమ అధికారి ఇందిరా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థ ఏర్పడిన సందర్భంగా సెలవు దినం గా ప్రకటించాలి

- హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కుడిపల్లి శ్రీలత

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**




తెలంగాణ ప్రాంతానికి మణిహారంగా ఉన్న సింగరేణి సంస్థ ఉత్పత్తి ఉత్పదకత తో ముందుకు దూసుకు పోతున్న సంస్థ బొగ్గు ఉత్పత్తి లోనే కాకుండా విద్యుత్తు ఉత్పాదన రంగంలో కూడా ప్రవేశించి ధర్మల్ పవర్ స్టేషన్ ద్వారా అత్యధిక విద్యుత్ అందిస్తుంది అలాగే సోలార్ విద్యుత్ ప్లాంట్ కుడాఏర్పాటు చేసుకున్నాం..ఇంతటి ఘనతకు సింగరేణి కార్మికులే కారణం ఇప్పుడు కొన్ని మెరుగైన వసతులు ఉన్నా గతంలో పెద్ద సౌకర్యాలు లేక పోయిన ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పనిచేశారు కార్మికులు వారి కష్టం త్యాగాల ఫలితమే నేడు లాభాల బాటలో నడుస్తుంది మన సింగరేణి తెలంగాణ రాష్ట్రంనీకి సింగరేణి సంస్థ కు ఇంతటి కీర్తి ప్రతిష్టలను అందిస్తున్న మన కార్మికులకు సింగరేణి సంస్థ ఏర్పడిన రోజైన డిసెంబర్ 23. న వేతనం తో కూడిన సెలవు దినం గా ప్రకటించాలి అని అలాగే ఇన్కమ్ ట్యాక్స్ రద్దు కార్మికునికి సొంత ఇంటి పథకం200 గజాల స్థలం కేటాయించాలని. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మరియు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ని మరియు కోల్ బెల్ట్ ఏరియా మంత్రులను మరియు ఎంఎల్ఏ లను సింగరేణి సి అండ్ ఎం డి బలరాం నాయక్ ని సింగరేణి యాజమాన్యానికి హెచ్ ఎం ఎస్ యూనియన్ తరుపున సింగరేణి కార్మికుల తరుపున హెచ్ఎంఎస్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కొడపల్లి శ్రీలత విన్నవించుకుంటున్నారు



## అంబేద్కర్‌ను అవమానపరిచిన అమిత్ షా కేంద్ర హోం మంత్రిగా కొనసాగే అర్హత లేదు

**ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:**

అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధర్మసాగర్ మండల దళిత హక్కుల పోరాట సమితి మండల కార్యదర్శి రాజారపు రత్నం మాట్లాడుతూ, అంబేద్కర్‌ను అవమానించే విధంగా అమిత్ షా పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలు హేయమైనవని, అలాంటి వ్యాఖ్యలు చేసే వ్యక్తి కేంద్ర హోం మంత్రిగా కొనసాగడానికి అర్హత లేదని ఆరోపించారు.

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల పెద్ద పెండ్యాల గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం రాజారపు రత్నం మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాతను అవమానించడంలో బీజేపీ మనువాద ధోరణి మరోసారి బయటపడిందని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవి అనుభవిస్తున్న వారు, అలాంటి మహానుభావుని అవహేళన చేయడం సిగ్గుచేటన్నారు.

**జమిలి ఎన్నికలపై విమర్శలు**

జెమిలి ఎన్నికల ద్వారా బీజేపీ అవినీతిపరులను కాపాడడానికి ప్రయత్నిస్తోందని, ఇది దేశ ప్రజలను మరింత దారిద్ర్యంలోకి నెట్టే యత్నమని రాజారపు రత్నం పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తూ పార్లమెంట్ సమయాన్ని వృథా చేయడం సరైనది కాదని ఆయన అన్నారు.

**అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్**

అమిత్ షా వ్యాఖ్యలు అంబేద్కర్‌ను మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్న లక్షలాది మందిని అవమానించాయని ఆరోపించారు. విద్వేషాలు వ్యాప్తి చేస్తున్న అమిత్ షా, దేశానికి ప్రమాదమని, వెంటనే ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి పెద్ద పెండ్యాల గ్రామ శాఖ కార్యదర్శి రాజారపు దేవన్న, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి గోకుల రాజయ్య, పెద్ద పెండ్యాల దళిత నాయకులు కలకోటి సాంబయ్య, కొత్తపల్లి బిక్షపతి ,జిట్ట కుమార్,రాజారపు చింటూ. కొలుగూరి బాబు.శీను గంధమాల రాజన్. బాబు .ఆరోగ్యం. సురేష్ అగస్టిన్ బన్నీ జీవన్ అన్వేష్ గట్టయ్య ప్రకాశం ఎల్లయ్య ఇంద్రయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## పెద్ద సినిమాలపై ముఖ్యమంత్రి నిర్ణయం స్వాగతిస్తున్నాము

- ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా నాయకులు షేక్ హిమామ్

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్ద సినిమాలపై ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాము. అని ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా నాయకులు షేక్ హి మామ్ అన్నారు. ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా ఖమ్మం జిల్లా ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు షేక్ హిమాం మాట్లాడుతూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి సినీ నటుడు అల్లు అర్జున్ ఘటనపై అల్లు అర్జున్ సినిమా చూడటానికి వచ్చి చనిపోయిన మహిళ రేవతి కుటుంబం పట్ల అల్లు అర్జున్ ప్రదర్శించిన తీరుపై ముఖ్యమంత్రి స్పందించడం స్వాగతిస్తున్నాము భవిష్యత్తులో పెద్ద హీరోల సినిమాలు బెనిఫిట్ షోల్ రద్దు చేయడం సినిమా టికెట్లు పెంపును రద్దు చేయడం స్వాగతించిన విషయం. సినీ నటుడు అల్లు అర్జున్ ఒక పెద్ద స్టార్ గా ఉన్న వ్యక్తి అలాంటి స్టార్ ఒక సినిమా థియేటర్ కి సినిమా చూడటానికి వచ్చేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి సినిమా థియేటర్ యజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చాము పోలీసులు బందోబస్తు సరిగా చేయలేదు బందోబస్తు చేయకపోవడం వల్లే ఆ ఘటన జరిగిందని థియేటర్ యజమాన్యం గాని పుష్ప సినిమా నిర్మాతలు గాని హీరో గాని చెప్పడం చాలా విడ్డూరంగా ఉంది. అల్లు అర్జున్ రావడం వల్లే అల్లు అర్జున్ చూడటానికి ప్రజలు ఒక్కసారిగా రావడం వల్ల తోక్కేసులాట జరిగి మహిళ చనిపోవడం జరిగింది. అలాగే వాళ్ళ కుమారుడు అపస్మారక స్థితిలో వెళ్లిపోవడం సుమారు 18 రోజులపాటు ఇంకా స్పృహలోకి రాకపోవడం చాలా బాధాకరంగా ఉంది ఆ కుమారుడు స్పృహలోకి వచ్చిన తర్వాత తల్లి లేదని విషయం తెలిస్తే ఎంత బాధ పడతాడు అది వర్ణాతితం అలాగే అతని చెల్లి కూడా తల్లిని అడుగుతా ఉంది అమ్మ ఏది అని అడిగితే వస్తుంది అని చెప్తున్నారు తండ్రి ఆ కుటుంబ బాధని అర్థం చేసుకోకుండా అల్లు అర్జున్ కనీసం ఆ బాబుని చూడటానికి అని ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవడంలో గాని కనీసం బాధ్యతయుతంగా అల్లు అర్జున్ ప్రవర్తించలేదు. అల్లు అర్జున్ ని అరెస్టు చేసిన తర్వాత బెయిల్ కోసం కొన్ని గంటల్లోనే తెప్పించడానికి ప్రయత్నం చేశారు తెప్పించారు జైల్లో అల్లు అర్జున్ కోసం అధికారులు కూడా సకల సౌకర్యాలు చేయడానికి పూనుకున్నారు ఇది కూడా చట్టానికి విరుద్ధం చట్టానికి అందరూ సమానులే చెప్పే చట్టం పేదవాడికి ఒక చట్టం ఉన్నవాడికి ఒక చట్టం అలా ప్రవర్తించొద్దు. బెయిల్ వచ్చిన తర్వాత కూడా ఈరోజు మటుకు అల్లు అర్జున్ బాబును చూడటానికి హాస్పటల్ కి వెళ్ళకపోవడం చాలా బాధాకరం ఇంకా ముఖ్యమంత్రి గారు చెప్పిన విషయాలపై ప్రెస్ మీట్ పెట్టడం కరెక్ట్ కాదు అలాగే సినీ ప్రముఖుల అందరు కూడా అల్లు అర్జున్ అరెస్టు కాగానే ఆయన ఇంటికి రాగానే ఏదో కొంపలు మునిగిపోయినట్టు ఆయన ఇంటికి సినీ స్టార్లు మొత్తం క్యూగట్టి పరామర్శించడం జరిగింది. అదేదో నష్టం జరిగిన కుటుంబానికి అందరూ సినీ హీరోలు ఎంతో కొంత ఆర్థిక సహకారాన్ని ప్రకటిస్తే చాలా బాగుండేది కానీ అలాంటి ప్రయత్నం ఏం చేయలేదు ఆయన ఏదో పెద్ద పోరాటం చేసిండని జైలుకుపోయి వచ్చిండని సినీ హీరోలు అందరు కూడా అల్లు అర్జున్ ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది. ఇప్పటికైనా సినీ హీరోలు అందరూ కూడా చనిపోయిన మహిళా కుటుంబానికి ఆర్థిక సహకారాన్ని ప్రకటించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ ప్రకటన తెలిపిన వారిలో ప్రజానాట్యమండలి నాయకులు సారంగి పాపారావు, బడే మియా చౌదరి, షేక్ ఖాదర్ బాబు, సినీ డాన్సర్ వెంకటేష్, సినీ దర్శకులు శ్రీ గుమ్మడి, లాల్ సింగ్, మద్ది శ్రీను, ఎర్ర నగేష్, తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారి అక్షితను ఆశీర్వదించిన ఎంపీ, ఎమ్మెల్యే

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామానికి చెందిన రజిత కీర్తిశేషులు వెంకట్ రెడ్డి గార్ల కుమార్తె అక్షిత పుట్టు చీర కార్యక్రమానికి హాజరైన నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి , వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి చిన్నారిని ఆశీర్వదించారు.పిల్లల జీవితాల్లో ఇలాంటి కార్యక్రమాలకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని వారి ఆనందాలను తల్లిదండ్రులుగా మనం గౌరవించాల్సిందేనని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా తన సోదరుడి కుమార్తె కు సంబంధించిన ఇట్టి కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన మణిగిల్ల గ్రామ మాజీ సర్పంచ్ సరిత తిరుపతి రెడ్డి గార్లను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో డి సి సి బి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బాలికలకు రెసిడెన్షియల్ పాఠశాల బంగారు భవిష్యత్ ను ఇవ్వాలి

- మంచి సంస్కృతి సాంప్రదాయాలతో సమాజంలో పౌరుడిగా ఎదగాలని కోరుతున్నా..
- కన్న కలలు సాకరమయ్యేందుకు విద్యార్థిని లు నిరంతరం శ్రమించాలి..
- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ.

**మెదక్ జిల్లా ప్రతినిధి డిసెంబర్, తెలంగాణ ముచ్చట్లు:**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మెదక్ జిల్లాలో ఆదివారం పర్యటించి కుల్చారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినిలతో ఏర్పాటు చేసిన ముఖాముఖి చర్చా కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను కళాశాల విద్యార్థినులు గౌరవ వందనంతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు విభిన్న సంస్కృతి సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు.

**విద్యార్థినులు వేసిన పలు ప్రశ్నలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమాధానాలు ఇచ్చారు.**

క్రీడలలో బ్యాడ్మింటన్ క్రీడ అంటే ఇష్టమని, భారత మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తనకు ఆదర్శమని, నిరంతరం చదవడం, రాయడం పైనే ఆసక్తి చూపుతానని, పుస్తకాలే తన నేస్తమన్నారు. అంతకంటే ఎక్కువగా పిల్లలతో గడపడం మరింత ఇస్తామన్నారు.చిన్నారులు చక్కని ప్రశ్నలు వేశారని, అవి తనను ఎంతో ఆనందింప జేశాయన్నారు.దేశ భవిష్యత్తు కు పునాదిలాంటి వారని, సమస్యలను అధిగమిస్తూ లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యాలయాలు దేవాలయాలతో సమానమని, చిన్నతనం నుండే క్రమశిక్షణతో మెసలుతూమంచి నాగరికత పుణికి పుచ్చుకొని భవిష్యత్ కు మార్గ నిర్దేశనం చేసుకోవాలన్నారు. మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ...దేశప్రగతి విద్యార్థుల తరగతి గదులలోనే అన్ని స్వామి వివేకానంద అన్నట్లు చెబుతూ విద్యను ఇష్టతతో అభ్యసించాలన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల లక్ష్యాలను ప్రశంసించారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. విద్యార్థినులు భిన్న సంస్కృతులను మేళవిస్తూ ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయన్నారు.విద్యార్థులు పట్టుదల,క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి ఎదగాలని అనుకున్న విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు పునాది లాంటివని, తప్పనిసరిగా అనుకున్న లక్ష్యాలను సాధించ గలుగుతారన్నారు.

**రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ఘనంగా సన్మానించారు.**

అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపుల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రెటరీ అలుగు వర్షిణి అదనపు కలెక్టర్ నగేష్, సంబంధిత శాఖల అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





# దయాకర్ రెడ్డి మనవడిని ఆశీర్వదించిన ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి మనవడు ( పెద్ద కూతురి కుమారుడు ) అన్నప్రాశన వేడుకకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి హాజరయ్యారు. నగరంలోని గొరిల్లాపార్క్ లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంపీ రఘురాం రెడ్డి వెళ్లి.. దయాకర్ రెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తదితరులతో కలిసి చిన్నారిని మనసారా దీవించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, శ్రేణులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన టిప్పర్

- ఇద్దరు మృతి, మరొకరికి గాయాలు

**పటాన్ చెరు,తెలంగాణ ముచ్చట్లు**

పటాన్ చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని వెనక నుండి కంటైనర్ లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యారు. పటాన్ చెరు సీఐ జి.వినాయక రెడ్డి కథనం ప్రకారం.. అమీన్ పూర్ మండల పరిధిలోని కిష్టారెడ్డి పేటకు చెందిన అశోక్ కుమార్ సీవిల్ ఇంజనీర్ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం సంగారెడ్డిలో ఉండే తన సోదరుడు ఇంటికి వెళ్లేందుకు కిష్టారెడ్డిపేట నుండి సంగారెడ్డికి స్కూటీపై అశోక్ కుమార్ తో పాటు వరుసకి తమ్ముడైన గణేష్ (17), భార్య నాగశ్యామల(26) ముగ్గురు కలిసి స్కూటీపై బయలుదేరారు. మార్గమధ్యంలో పటాన్ చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్ చౌరస్తా జాతీయ రహదారిపై గల యూటర్న్ వద్దకు రాగానే స్కూటీని వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ వచ్చి ఢీకొట్టింది. ప్రమాద ఘటనలో నాగశ్యామల, గణేష్ లు అక్కడికక్కడే మృతి చెందారు. అశోక్ కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అంబేద్కర్‌పై చేసినా వ్యాఖ్యలపై అమిత్ షా రాజీనామా చేయాలి

- దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి ఆయన మాట్లాడిన వ్యాఖ్యలను వెనక్కికి తీసుకోవాలి
- ఎంపీ మల్లు రవి, ఏమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

**వనపర్తి ,తెలంగాణ ముచ్చట్లు:**



దేశ ప్రజలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యంని కాపాడడం కోసం రక్షణ కవచం లాగా ఏర్పడి దేశాన్ని రక్షిచాలి అని పార్లమెంట్ ఎంపీ మల్లురవి అన్నారు. వనపర్తిలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మల్లురవి మాట్లాడుతూ పార్లమెంటులో సమావేశంలో పార్లమెంటు సభ్యుల ఎదురుగా రాజ్యాంగాన్ని రాసిన అంబేద్కర్ ను అవమానం చేసి మాట్లాడిన బిజెపి కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పి ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.భారత ప్రజలు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించాలి. భారత పౌరులకు హక్కులు, స్వచ్చలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించారు. వాటిని హరించకుండా భారత దేశ పౌరులు గట్టిగా సమాధానం చెప్పాలని అని అన్నారు. రాజ్యాంగానికి పట్టాదారులు ప్రజలు. రాజకీయ నాయకులు కౌలు దారులు లాంటివారు కొద్దీ రాజులు ఉండిపోయేవారు మాత్రమే అన్ని అన్నారు.ప్రజాస్వామ్యం మీద దాడి చేసిన బీజేపీ కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి అని అన్నారు. పార్లమెంటులో అంబేద్కర్ కు జరిగిన అవమానాన్ని దేశం లో ఉన్న ప్రజలందరూ గమనించారు అన్ని అన్నారు, కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఇండియా కూటమి నేతలు పార్లమెంటులో ఉన్న అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేస్తూ అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశాం అన్నారు. ప్రధానమంత్రి మోడీ,అమిత్ షా రాజ్యాంగం,ప్రజాస్వామ్యం పై దాడి చేస్తున్నారు అన్ని అన్నారు.ప్రజల హక్కులను కాలరాస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వంని గద్దె దించే విధంగా భారత పౌరులు కృషి చేయాలి అన్నారు.

**ఎమ్మెల్యే తుడి మేఘరెడ్డి మాట్లాడుతూ...**

భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పై కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడిన వ్యాకలను త్రీవంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే మేఘ రెడ్డి అన్నారు. బేషరతుగా క్షమాపణ చెప్పి ఆయన చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముక్త కంఠంతో ఖండించారు అని అన్నారు ఈ సమావేశంలో డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మహేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ ,నియోజవర్గ సమన్వయకర్త లకాకుల సతీష్ ,మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో పాల్గొన్నారు.



# అతిధి అధ్యాపకుల సమస్యలపై ఖమ్మం ఎంపీ కి వినతి పత్రం

**ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కలిసిన తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ల అతిధి అధ్యాపకులు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి రాగానే తక్షణమే తెలంగాణ రాష్ట్రం లో పనిచేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల కు మినిమం టైం స్కేల్ ద్వారా 50,000/ జీతం మరియు ఎటువంటి షరతులు లేకుండా ప్రతి సంవత్సరం అతిధి అధ్యాపకుల ను కొనసాగింపు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హన్మకొండ సభలో చెప్పారు అని తక్షణమే న్యాయమైన హామీని అమలు పరిచే విషయం పై సీఎం తమ సమస్యలను తెలియపరిచి పరిష్కారం చూపాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘు రాం రెడ్డి కి వినతి పత్రం ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ముసుకు. రాజీ రెడ్డి, కొమ్ము అభిజిత్ దేవ్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు పేరెల్లి శ్రీను,జిల్లా జనరల్ సెక్రటరీ కొమ్ము.నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు కొమ్మినేని వీరన్న, జిల్లా కోశాధికారి వనం. పుల్ల రావు, ఇతర సీనియర్ అధ్యాపకులు అప్పారావు, ఉపేందర్, శ్రీనివాస్ రావు,ఉష పావని తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలి

- ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సత్యా శారదా దేవి

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ సత్యా శారదా దేవి, ఇందిరమ్మ ఇండ్ల సర్వేను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సర్వేయర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని వడ్డేపల్లి కాలనీలో సర్వే కార్యక్రమాన్ని పరిశీలించిన ఆమె, ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

**64 వేల దరఖాస్తులపై సర్వే**

గ్రేటర్ వరంగల్‌లో మొత్తం 64 వేల దరఖాస్తుల సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 4000 మాత్రమే పూర్తి అయ్యాయని కలెక్టర్ తెలిపారు. సర్వేలో వేగం పెంచి, ప్రతి డివిజన్‌లో 500 దరఖాస్తులకు ఒక సర్వేయర్ నియమించి 31 డిసెంబర్ లోగా పూర్తి చేయాలని ఆమె సూచించారు. సర్వేలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని, దరఖాస్తుదారుల పేర్లు మిస్ అయితే మళ్లీ దరఖాస్తులను స్వీకరించి పరిశీలించాలని ఆమె స్పష్టం చేశారు.

**అధికారులు, సిబ్బందికి సూచనలు**

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవీందర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వార్డు ఆఫీసర్ హరినాథ్, హౌసింగ్ డీఈ సిద్ధార్థ నాయక్ తదితరులు పాల్గొన్నారు





# మెదక్ చర్చికి 100 సం.లుగా విశ్వాసం నమ్మకం దేవుని కృప కు మార్గనిర్దేశనం

- అనేక మంది జీవితల మార్పుకు శ్రీకారం
- విజయానికి క్రీస్తు బోధనలకు జీవం ఇచ్చే ప్రతీక.
- శాంతి కోరేవారికి మెదక్ చర్చి ప్రతీక.
- తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ.

**మెదక్ జిల్లా ప్రతినిధి డిసెంబర్ 22: తెలంగాణ ముచ్చట్లు:**



గవర్నర్ కు ఘనంగా స్వాగతం పలికిన మెదక్ శాసనసభ్యులు మైనం పల్లి రోహిత్ రావు ఆదివారం మెదక్ జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ ముందుగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ లు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలు, పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గౌరవ జిష్ణు దేవ్ వర్మ ఆదివారం మెదక్ చర్చికి రాక సందర్భంగా గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత చర్చి ప్రాంగణంలోకి రాగానే మెదక్ ఆర్డీఓ రమాదేవి రాష్ట్ర గవర్నర్ గారికి పూల బొకే అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. చర్చి నిర్వాహకులు రెడ్ కార్పెట్ వేసి ఘనమైన స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ క్రీస్తు శిలువ వద్దకు వెళ్లి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం గురువులు గవర్నర్ ను శాలువా, చర్చి నమూనా విగ్రహాన్ని గవర్నర్ కు అందజేశారు.

మెదక్ చర్చి 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ. సన్మానీయ అతిథులు, సోదరులు, సోదరీమణులు, పిల్లలు, ఈరోజు మెదక్ లో కాథెడ్రల్‌లో ఈ ఆనందకరమైన సందర్భంగా ఒకటిగా సమావేశమై ఉన్న మీ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మెదక్ కాథెడ్రల్ 2024 శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనడం నాకు ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు.

చర్చికి 100 సంవత్సరాల సంబరమే కాదు, విశ్వాసం, తపన ఆ భగవంతుని అమోఘమైన కృపకు నిదర్శనంగా నిలిచే ఒక మహత్తర ఘట్టం అని పేర్కొన్నారు. ఈరోజు మనం ఇక్కడ సమావేశమైన ఈ సందర్భంలో క్రీస్తు చెప్పిన మాటలను ఆలోచిద్దాం ఎక్కడ ఇద్దరు లేదా ముగ్గురు నా నామంలో కూడి ఉన్నారో అక్కడ నేను వారితో ఉంటాను గత శతాబ్దంగా, మేదక్ కాథెడ్రల్ అనేక మందికి దైవ సాన్నిధ్యానికి కేంద్రంగా నిలిచిందనీ, ఒక విశ్వాసం పెంపొందిన స్థలంగానే కాక అనేకమంది జీవితాలు మారిన ప్రదేశంగా నిలిచిందన్నారు.

మెదక్ కాథెడ్రల్ పునాదిని 20వ శతాబ్దం ప్రారంభంలో మహా కష్టకాలంలో, కరువు వేధించిన సమయంలో వేశారు. రేవరెండ్ చార్లెస్ వాకర్ తమ అపారమైన విశ్వాసంతో దయతో నడిపింపబడుతూ. ప్రజలకు ఉపశమనం ఇచ్చి భవిష్యత్తు తరాల కోసం ఆశకి సౌధంగా నిలిచే దేవాలయాన్నినిర్మించే స్వప్నం చూసారన్నారు. గోతిక్ రివైవల్ శైలిలో నిర్మించబడిన ఈ కాథెడ్రల్, ఏషియా ఖండంలోని అతిపెద్ద మెదక్ చర్చిలలో ఒకటిగా నిలుస్తోందనీ. 5,000 మందికి పైగా భక్తులను ఆశ్రయించే సామర్థ్యం గల ఈ చర్చి, దాని అద్భుతమైన మినారులు, అందమైన స్టెయిన్డ్ గ్లాస్ విండోలు, మరియు స్ఫూర్తిదాయకమైన రూపకల్పనతో, కేవలం శిల్పకళా మాత్రమే కాకుండా, ఈ సమాజం ఉమ్మడిగా కలిసికట్టుగా సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచిందన్నారు. మెదక్ కాథెడ్రల్ కేవలం ఒక నిర్మాణం కాదు; ఇది క్రీస్తు బోధనలకు జీవమిచ్చే ప్రతీక. మీకు తెలిసిన ఈ నా అన్నదమ్ములలో ఎవరికి చేసినా, నాకు చేసినట్లే. ఈ మాటలకు అనుగుణంగా గత శతాబ్దంగా ఈ చర్చి అనేకమందికి విద్య, వైద్యం, మరియు ఆధ్యాత్మిక మార్గనిర్దేశనం అందించిందనీ గుర్తు చేశారు.

ఈ శతాబ్ది ఉత్సవం కృతజ్ఞతతో పాటు క్రియాశీలతకు పిలుపుగా కూడా నిలుస్తుందనీ. ఈ పవిత్ర స్థలం వారసత్వాన్ని గౌరవించే సమయంలో దాని ప్రేమ, సేవ, న్యాయానికి చేసే కృషికి మనమందరం మరోసారి సంకల్పం చేసుకుందమని. నేను మిమ్మల్ని ప్రేమించినట్లే మీరు ఒకరిని మరొకరు ప్రేమించండి అనే క్రీస్తు బోధనకు ఈ కాథెడ్రల్ ప్రతీకగా నిలుస్తుందనీ పేర్కొన్నారు.

ఈ శతాబ్ది ఘట్టం మెదక్ కాథెడ్రల్ పనిని కొనసాగించడానికి మనందరినీ ప్రేరేపించాలన్నారు. అవసరమైన వారికి చేయూత అందించటంలో, సామాజిక న్యాయానికి బలంగా నిలవడంలో, ఈ ప్రపంచంలో ప్రేమా దీప్తిని వ్యాపింపజేయడంలో మన కృషి కొనసాగించాలనీ పిలుపునిచ్చారు.

ఈ 100 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన చర్చిలో కృపానుగ్రహాన్ని దేవునికి సమర్పించుకుంటూ, ఈ గొప్ప దేవాలయాన్ని మనకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానీ అలాగే, ఈ ప్రయాణాన్ని సాధ్యం చేసిన అనేకమంది మిషనరీలు, కార్మికులు, సమాజ నాయకులు, మరియు భక్తుల అంకితభావానికి మన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుందమన్నారు.

క్రీస్తు మాటలను నెరవేరుస్తూ,మీరు ప్రపంచానికి వెలుగై ఉండాలి. కొండమీద ఒక పట్టణం దాచబడలేదు మేదక్ కాథెడ్రల్ ఆ పట్టణంలా నిలిచి, ఆధ్యాత్మిక శక్తి శాంతిని కోరేవారికి మార్గదర్శిగా ఉండాలన్నారు.మేదక్ కాథెడ్రల్ భక్తులందరికీ శ్రేయోభిలాషులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ శతాబ్ది ఉత్సవం, మరొక శతాబ్దపు సేవ, విశ్వాసం, మరియు పరివర్తనకర ప్రభావానికి నాంది కావాలని కోరుకుంటున్నారు.

మీ అందరికీ ఒక శుభ క్రిస్మస్ , నూతన సంవత్సర శుభాకాంక్షలు అన్నారు. గౌరవం దేవునికి భూమిమీద శాంతి అందరికీ అనే సందేశం మన ప్రభువైన యేసు క్రీస్తు మనకు అందించారనీ. అందరి జీవితాల్లో శాంతి, అభివృద్ధి, విజయాలు ఉండాలని కోరుకుంటున్నాన్నారు.జై హింద్, జై భారత్ అంటూ ముగించారు. చర్చి కమిటీ సభ్యులు శాలూవాతో సన్మానించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు, రాష్ట్ర గవర్నర్ కార్యదర్శి దన కిషోర్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ప్రెస్ బ్రీటర్ ఇంచార్జ్ శాంతయ్య మెదక్ చర్చి కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

# కువైట్ ఫ్యూచర్ జర్నీలో
# భారత యువతదే ముఖ్యపాత్ర







**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

కువైట్‌కు అవసరమైన మానవ వనరులు, నైపుణ్యాలు, సాంకేతికతను అందించడంలో భారత్ ముందంజలో ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కువైట్ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో భారతీయ ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా మారిందని తెలిపారు. భారత్ స్టార్టప్‌లు, కువైట్ అవసరాలకు అత్యాధునిక పరిష్కారాలను చూపించగలవని అన్నారు. కువైట్‌లో హాలా మోదీ పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ, తన కువైట్ పర్యటన రెండు దేశాల ప్రజల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. కువైట్ సమాజానికి భారతీయతను పరిచయం చేశారని ప్రవాస భారతీయులను కొనియాడారు. భారత్ నుంచి కువైట్‌కు చేరుకునేందుకు నాలుగు గంటల సమయం పడితే, ఒక భారత ప్రధాని కువైట్‌కు రావడానికి నాలుగు దశాబ్దాలు పట్టిందని మోదీ చెప్పారు.

**కువైట్ మినీ ఇండియా!**

పశ్చిమాసియా దేశమైన కువైట్‌లో ఇంత మంది భారతీయులను చూడటం చాలా ఆనందంగా ఉందని, ఇదో మినీ ఇండియాలా కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఏటా వందలాది మంది భారతీయులు ఇక్కడికి వస్తున్నారని, అలా కువైట్ సమాజానికి భారతీయతను పరిచయం చేశారని మోదీ అన్నారు. భారతదేశ ప్రతిభ, సాంకేతికత, సంప్రదాయాలను మేళవించి కువైట్ నేలను భారతీయ నైపుణ్య రంగులతో నింపారని ప్రశంసించారు. భారతదేశ స్టార్టప్‌లు, సాంకేతికతలు కువైట్ అవసరాలకు ఆధునిక పరిష్కారాలను చూపించగలవని మోదీ అన్నారు. కొవిడ్ 19 మహమ్మారి సమయంలో భారత్‌కు లిక్విడ్ ఆక్సిజన్‌ను సరఫరా చేసిన కువైట్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

అంతకుముందు రెండు రోజుల పర్యటన కోసం కువైట్ చేరుకున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం లభించింది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన ప్రవాస భారతీయులు ప్రధానికి స్వాగతం పలికారు. అందరినీ మోదీ ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా తాను ఇచ్చిన మాట ప్రకారం 101 ఏళ్ల మంగళ్ సేన్ హండా అనే మాజీ ఐఎఫ్ఎస్ అధికారిని కలిశారు. మంగళ్ సేన్ హండాను కలవాలంటూ ఎక్స్ వేదికగా ఆయన మనవరాలు చేసిన అభ్యర్థనను అంగీకరించిన మోదీ, కువైట్‌కు చేరుకున్న అనంతరం ఆయనతో ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు.



**చారిత్రక సంబంధం ఎంతో విలువైనది!**

కువైట్ పాలకుడు షేక్ మిషాల్ అల్అహ్మద్ అల్‌జబార్ అల్‌సబా ఆహ్వానం మేరకు వెళ్లినట్లు ప్రధాని మోదీ ఎక్స్ లో ఓ పోస్టు పెట్టారు. ఇరుదేశాల మధ్య భవిష్యత్తు భాగస్వామ్యానికి సంబంధించిన రోడ్ మ్యాప్ రూపొందించటానికి ఈ పర్యటన ఓ మంచి అవకాశమని పేర్కొన్నారు. కువైట్‌తో తరతరాలుగా కొనసాగుతున్న చారిత్రక సంబంధం ఎంతో విలువైనదని అన్నారు. వాణిజ్యం, ఇంధన రంగాల్లో భాగస్వాములమే కాకుండా పశ్చిమాసియాలో శాంతి, భద్రత, స్థిరత్వం, శ్రేయస్సును భారత్ కువైట్ కోరుకుంటున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు.



# అంబేద్కర్ పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై నిరసన

- **పీవీ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన**
- **అంబేద్కర్ అభిమాన సంఘం నాయకులు ఆంగోతు మంగీలాల్**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు :**

భారతరత్న ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మణుగూరు అంబేద్కర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పీవీ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసనకారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ అభిమాన సంఘం నాయకులు ప్రముఖ బుద్ధిష్ట్ అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి దార్శనికులు భారత రాజ్యాంగ నిర్మాత పార్లమెంట్ వ్యవస్థకు మూల స్తంభమైన బాబాసాహెబ్ పై కేంద్ర హోం మంత్రి అనుచిత వ్యాఖ్యల ను యావత్ దేశ ప్రజలు నిరసించాలన్నారు. దేశ అత్యున్నత హోదాలలో ఉన్న వ్యక్తులు ఇలా వ్యాఖ్యానించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు ఇప్పటికైనా అమిత్ షా తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బాబాసాహెబ్ కు క్షమాపణ చెప్పాలని కోరారు. అజ్ఞానుల మదిలో జ్ఞానాన్ని ప్రసాదించాలనే ఆలోచనతో అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపామన్నారు. ఈ కార్యక్రమంలో ఏ మంగీలాల్, జి శ్రీనివాస్, చల్లా కాంతారావు, రామల్ల విద్యాసాగర్, ఆర్ శ్రీకాంత్, వరికెళ్ల ముత్యాలరావు, డి వంశీ, కె సాయి ప్రవర్ష, పి భార్గవ్ సాయి, ఎన్ జాషువా సిహెచ్ పాల్, వై ఈశ్వర్, బి అభినవ్, బి వికాస్, డి యశ్వంత్, పి అశ్విత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## నమ్మకమైన ఖాతాదారుడి
# పేరుతో వాట్సాప్‌లో చెక్కు

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

సైబర్ మోసాలకు గురి కావొద్దంటూ పదే పదే హెచ్చరించే బ్యాంకు సిబ్బందినే బోల్తా కొట్టించారు మాయగాళ్లు. నమ్మకమైన ఖాతాదారుడి పేరుతో ఫోన్ చేసి, బ్యాంకు చెక్కును వాట్సాప్‌లో ఫొటో పెట్టి, రూ.9.5 లక్షల నగదును బదిలీ చేయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అనంతపురంలోని రాంనగర్ ఎస్‌బీఐలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనంతపురం ఎస్బీఐ మేనేజర్ సైబర్ క్రైం మోసగాళ్ల చేతిలో చిక్కి నగదు బదిలీ చేసిన ఘటన సంచలనంగా మారింది. తాను హోండా షోరూం ఎండీ కవినాథ రెడ్డినని, వాట్సాప్‌లో చెక్ పెట్టానని, వెంటనే దిల్లీలోని బ్యాంకు ఖాతాకు రూ.9.5 లక్షలు జమ చేయాలని చెప్పాడు.నిజమేనని నమ్మిన బ్యాంకు మేనేజర్ నగదు బదిలీ చేశారు. ధన్వి హోండా షోరూం ఖాతా నుంచి రూ.9.5 లక్షలు డెబిట్ చేసిన మెసేజ్ రాగానే కంగుతున్న షోరూం మేనేజర్ పరుగున ఎస్బీఐకి వచ్చారు. ఈలోపు దిల్లీలోని సైబర్ నేరగాళ్ల ఖాతాకు చేరిన రూ.9.5 లక్షలు విత్ డ్రా చేసేసి, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసేశారు. అలా మేనేజర్ తప్పిదంతో సైబర్ నేరగాళ్లు సొమ్ము కాజేశారు.ఏపీలోని అనంతపురం రాంనగర్‌లోని ధన్వి హోండా బైక్ షోరూంనకు 10వ తేదీన ఓ వ్యక్తి ఫోన్ చేసి, తనను జొమాటో మేనేజర్‌గా పరిచయం చేసుకున్నాడు. తమ సిబ్బంది ఫుడ్ డెలివరీ ఇవ్వడానికి పది బైక్‌లు కొనాలని అనుకున్నట్లు చెప్పి, కొటేషన్ ఇవ్వాలని అడిగారు. జొమాటో పేరు మీద కొటేషన్‌తో పాటు క్యాన్సిల్డ్ చెక్‌ను పంపించాలని సైబర్ నేరగాడు చెప్పాడు. వారు చెప్పినట్టుగానే పది బైక్‌లకు ఆర్డర్ వచ్చిందన్న సంతోషంలో షోరూం మేనేజర్ లెటర్ హెడ్‌లో పది బైక్‌ల ధర, ఇతర పన్నుల వివరాలను, క్యాన్సిల్ చేసిన చెక్కును ఫొటో తీసి జొమాటో మేనేజర్‌గా పరిచయం చేసుకున్న సైబర్ నేరగాడికి పంపించాడు.ఎండీ అంటూ మోసం చేసి : షోరూం నుంచి వెళ్లిన క్యాన్సిల్డ్ చెక్కులో షోరూం యజమాని సంతకం అలాగే ఉంచి, అడ్డంగా కొట్టిన గీతలను ఫొటో షాప్ ఉపయోగించి వాటిని తీసేసాడు. సంతకం చేసిన ఖాళీ చెక్కుగా మార్చేశాడు. ఇక బైక్ ధరల వివరాలతో పంపిన కొటేషన్ లెటర్ హెడ్‌లో వివరాలను పూర్తిగా చెరిపేశారు. తరువాత రాంనగర్ స్టేట్ బ్యాంక్ మేనేజర్ పేరును అభ్యర్థిస్తూ లెటర్ హెడ్‌లో మ్యాటర్‌ను టైప్ చేశారు. ఖాళీ చెక్కుతో పాటు, నగదు బదిలీ చేయాలని ఫేక్ లెటర్ హెడ్‌లను ఎస్బీఐ మేనేజర్ అంబ్రీశ్వర స్వామికి పంపించారు. దాంతో పాటు హోండా షోరూం ఎండీ కవినాథరెడ్డి పేరుతో ఫోన్ చేసి నమ్మబలికారు. తాను ధన్వి షోరూం ఎండీనని, తన ఫోన్‌లో ఛార్జింగ్ అయిపోవడంతో మరో ఫోన్‌తో మాట్లాడుతున్నట్లు మాయమాటలు చెప్పాడు.అన్ని సమకూర్చుకున్న నేరగాడు ప్లాన్ మొదలు పెట్టాడు. తన తల్లికి బాగోలేదని, దిల్లీలో ఆసుపత్రిలో చేర్చానని, తమ షోరూం చెక్కును వాట్సాప్ చేసినట్లు తెలిపాడు. అతను అనంతపురం వచ్చిన వెంటనే పంపించిన లెటర్ హెడ్, చెక్‌ల ఆధారంగా దిల్లీలోని బ్యాంకు ఖాతాకు రూ.9.5 లక్షలు బదిలీ చేశాడు. షోరూం బ్యాంకు ఖాతా నుంచి నగదు బదిలీ కాగానే, షోరూం మేనేజర్ మొబైల్‌కు మెసేజ్ వెళ్లింది. దీంతో మేనేజర్ కంగుతిన్నాడు. షోరూం ఖాతా నుంచి డెబిట్ కావడంతో బైక్ షోరూం మేనేజర్ వెంటనే రాంనగర్ స్టేట్ బ్యాంకు మేనేజరు దగ్గరకు వచ్చారు. తాము చెక్కు ఇవ్వలేదని, క్యాన్సిల్డ్ చెక్‌ను మార్ఫింగ్ చేసి మోసం చేశారని బ్యాంకు మేనేజర్ అంబ్రీశ్వరస్వామికి చెప్పారు. తనకు ఫోన్ చేసిన సైబర్ మోసగానికి బ్యాంకు మేనేజర్ ఫోన్ చేయగా, తాను ఎండీనేనని సమాధానం చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు.కానీ దిల్లీ ఖాతాకు వెళ్లిన వెంటనే నగదును విత్‌డ్రా చేశారు. ఈ ఘటన ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరగ్గా, బ్యాంకు మేనేజరు దిల్లీ వరకు వెళ్లి విచారించినప్పటికీ ఎలాంటి ఆధారాలు దొరక్కపోగా, ఎఫ్ఐఆర్ కూడా లేకపోవడంతో దిల్లీ పోలీసులు కనీసం సహకరించలేదు. దీంతో అన్ని ప్రయత్నాలు చేసి తిరిగొచ్చిన బ్యాంకు మేనేజర్ అంబ్రీశ్వరస్వామి, అనంతపురం నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 14వ తేదీన ఫిర్యాదు చేశారు.




# ఇకపై పోలింగ్ సీసీటీవీ ఫుటేజ్ చెక్ చేసేందుకు నో ఛాన్స్

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవరైనా తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం (ఈసీ) మార్పులు చేసింది. ఇక నుంచి పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, వెబ్‌కాస్టింగ్ రికార్డులను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. ఎన్నికల్లో పారదర్శకతకు ఇది విఘాతమని స్పష్టం చేసింది.ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు ఎన్నికల నిర్వహణ నిబంధనలు 1961లోని రూల్ 93(2)(ఏ)ను శుక్రవారం కేంద్ర న్యాయశాఖ సవరించింది. ఈ సవరణకు ఓ కోర్టు కేసు కారణమని ఈసీతోపాటు న్యాయశాఖ వేర్వేరుగా వివరణ ఇచ్చాయి. కొత్త సవరణతో ఎలక్ట్రానిక్ రికార్డులు మినహా ఇతర పత్రాలు, డాక్యుమెంట్లు తనిఖీకి అందుబాటులో ఉంటాయి. పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీవల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని, అందుకే నిషేధం విధించామని ఈసీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఫుటేజ్‌ను వినియోగించుకుని కృత్రిమ మేధ ద్వారా నకిలీ వీడియోలను తయారు చేస్తున్నారని తెలిపాయి. రూల్ 93కి సవరణ తర్వాతా అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ రికార్డులు అందుబాటులో ఉంటాయని, కానీ ఇతరులు తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని వివరించాయి. హరియాణా ఎన్నికలకు సంబంధించిన అన్ని రికార్డులను మహమ్మద్ ప్రాచా అనే వ్యక్తికి షేర్ చేయాలని ఇటీవల పంజాబ్ అండ్ హరియాణా హైకోర్టు ఆదేశించింది. రూల్ 93 (2)లో పత్రాలు, డాక్యుమెంట్లు, ఎలక్ట్రానిక్ రికార్డులనే విభజన లేనందున అన్ని రికార్డులను ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. అయితే దీనిని ఈసీ వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిబంధనలకు సవరణ చేసింది.

**ఈసీ ఎందుకు భయపడుతోంది? కాంగ్రెస్**

అయితే ఎన్నికల నిబంధనను మార్చడంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. పారదర్శకతకు ఈసీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించింది. ఈ సవరణను న్యాయపరంగా సవాలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం స్పష్టం చేశారు. కోర్టు తీర్పును పాటించాల్సిన ఈసీ, అందుకు విరుద్ధంగా నిబంధనలకు సవరణ చేయడం విడ్డూరమని వ్యాఖ్యానించారు.



# భీకర దాడులతో అమెరికా రివెంజ్ ఎటాక్

**ఇంటర్నెట్ డెస్క్,తెలంగాణ ముచ్చట్లు:**

పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు తారస్థాయికి చేరుకుంటున్నాయి. ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య ప్రారంభమైన పోరు క్రమంగా విస్తరిస్తోంది. రోజుకో దాడి, ప్రతిదాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. శనివారం హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌పై క్షిపణులు ప్రయోగించగా, అమెరికా ప్రతీకార దాడులు చేసింది. యెమెన్ రాజధానిలోని హౌతీల స్థావరాలే లక్ష్యంగా దాడులు చేసినట్లు అగ్రరాజ్యం పేర్కొంది."హౌతీల కార్యకలపాలు దెబ్బతినేలా దాడులు నిర్వహించాం. ఎర్ర సముద్రం, బాబ్ అల్ మాండెబ్, ఏడెన్ గల్ఫ్‌లో వ్యాపార నౌకలపై దాడులు చేశాం. హౌతీ రెబల్స్ కార్యకలాపాలకు అంతరాయం కలిగించడమే దీని లక్ష్యం" అని అమెరికా మిలిటరీ అధికారులు తెలిపారు.

**యెమెన్‌పై ఇజ్రాయెల్ ఎటాక్**

మరోవైపు గత గురువారం యెమెన్‌పై ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులు చేశాయి. ఈ దాడులు హౌతీల సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని జరిపినట్లు ఇజ్రాయెల్ దళాలు పేర్కొన్నారు. దీనికి ప్రతీకారంగా హౌతీ రెబల్స్ శనివారం ఇజ్రాయెల్ రాజధాని టెల్‌అవీవ్‌పై ప్రొజెక్టైల్ క్షిపణులను ప్రయోగించారు. అయితే వీటిని అడ్డుకోవడంలో ఇజ్రాయెల్ సైన్యం విఫలమైంది. ఫలితంగా 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడిని రక్షణ వ్యవస్థలు అడ్డుకోలేకపోవడంపై టెల్‌అవీవ్ విచారణకు ఆదేశించింది. టెల్‌అవీవ్‌పై హౌతీలు దాడులు చేసిన కొన్ని గంటల్లోనే, ఇజ్రాయెల్ మిత్రదేశమైన అమెరికా ప్రతీకార దాడులు చేయడం గమనార్హం.గాజాలో యుద్ధం మొదలైనప్పటి నుంచి హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులకు పాల్పడుతూనే ఉన్నారు. వీరికి ఇరాన్ మద్దతిస్తూ వస్తోంది. తాము పాలస్తీనియన్లకు సంఘీభావంగా వ్యవహరిస్తున్నామని హౌతీ తిరుగుబాటుదారులు పేర్కొంటున్నారు. గాజాపై యుద్ధాన్ని ఆపే వరకు ఇజ్రాయెల్‌పై దాడులు కొనసాగిస్తామని వారు చెబుతున్నారు. దీంతో హౌతీల సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ మిలిటరీ దళాలు దాడులు చేస్తున్నాయి.


**సొంత యుద్ధవిమానంపైనే కాల్పులు!**

కాగా, ఎర్ర సముద్రంలోని పెట్రోలింగ్ ఏరియాలో ఓ అమెరికా యుద్ధ విమానం పొరపాటున, తమ దేశానికే చెందిన మరో మిలటరీ ఎయిర్‌క్రాఫ్ట్‌పై కాల్పులు జరిపి, దానిని పడగొట్టింది. 'యూఎస్ మిలటరీకి చెందిన గైడెడ్ మిస్సైల్ క్రూయిజర్ ఎయిర్‌క్రాఫ్ట్ F/A18 ఎయిర్‌క్రాఫ్ట్‌పై పొరపాటున కాల్పులు జరిపింది. దీనితో సదరు F/A 18 కూలిపోయింది. అయితే అందులోని ఇద్దరు పైలట్లు స్వల్పగాయాలతో బయటపడ్డారు' అని యూఎస్ మిలటరీ తెలిపింది. దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు పేర్కొంది.

# యూత్ కాంగ్రెస్ నేతలను అభినందించిన బండి రమేష్

**కూకట్ పల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

ప్రజా సమస్యల పరిష్కారంలో పార్టీని నడిపించే విషయంలో యూత్ కాంగ్రెస్ నాయకుల పాత్ర వెలలేనిదని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. పదవులు పొందడంలోనే కాదు ప్రజలకు సేవ చేయడంలోనూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన మేడ్చల్ జిల్లా కూకట్పల్లి నియోజకవర్గం డివిజన్ స్థాయి యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన నాయకులతో ఆదివారం బాలానగర్ లోని పార్టీ కార్యాలయంలో రమేష్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ మాత్రమే దేశానికి దశ దిశ చూపిందని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే దేశం స్వయం సమృద్ధిని సాధించింది అన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి గారు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు గారు, సాదు ప్రతాప్ రెడ్డి గారు, లక్ష్మయ్య గారు, డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ ,మేకల రమేష్ ,మధు గౌడ్, బ్లాక్ అధ్యక్షురాలు రమాదేవి సంధ్య తదితరులు పాల్గొన్నా



# నవోదయాలకు స్థలాలు మంజూరు చేయండి

**బాల్కొండ,తెలంగాణ ముచ్చట్లు**

ఇటీవలే కేంద్ర కేబినెట్ జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలో నవోదయల ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా ఆదివారం జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్‌తో కలిసి ఈ రెండు జిల్లాల్లో నవోదయల ఏర్పాటుకు ఒక్కోచోట సుమారు 20 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ధర్మపురి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.ఈ సందర్భంగా రెండు జిల్లాల్లో పలు ప్రతిపాదిత స్థలాలను ఎంపీ,సీఎంకు వివరించారు.నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులను ఎంపీ అర్వింద్ సిఎం రేవంత్ రెడ్డికి వివరిస్తూ,మాధవ్ నగర్ ఆర్ఓబి 5050 పద్ధతిలో మంజూరు చేయబడిందని,అడివి మామిడిపల్లి ఆర్ఓబి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైనప్పటికీ,గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులను మళ్ళించిందన్నారు. కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు అందక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని,దీని వల్ల పనుల్లో కొంత జాప్యం జరుగుతుందన్నారు.ఇవే కాకుండా ఇతర ఆర్వోబీల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని,కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేసి,పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు. జిల్లాలో ప్రతిపాదిత జక్రాన్ పల్లి ఎయిర్పోర్ట్ పనులకు సంబంధించి ఓఎల్ఎస్ సర్వేని రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసి కేంద్రానికి నివేదించాలని కోరారు.మరోవైపు జగిత్యాల పట్టణంలో కేంద్రీయ విద్యాలయం సైతం మంజూరయ్యే దశలో ఉందని,దీనికి కూడా స్థల అన్వేషణ చేయాలని సీఎంని కోరారు.జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్,ఎంపీ అర్వింద్‌తో కలిసి జగిత్యాల పట్టణానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో చర్చించారు.తమ విజ్ఞప్తుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎంపీ అర్వింద్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలియజేశారు.



# దేవాలయాల అభివృద్ధికి తోడ్పాటును అందిస్తా

- **ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**
- **ముకురాల గ్రామ శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధి రూ.లక్ష విరాళం**

**- ఆమనగల్లు,తెలంగాణ ముచ్చట్లు**

ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు కల్వకుర్తి మండల పరిధిలోని ముకరాల గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయాన్ని సందర్శించిన గతంలో ముకురాల గ్రామంలో పర్యటించినప్పుడు ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆలయానికి విరాళం అందజేస్తానని ఇచ్చిన మాట ప్రకారం మొదటగా వంద బస్తాల సిమెంట్ అందించటంతో పాటు రూ.లక్ష చెక్ ని దేవాలయ అభివృద్ధి కొరకై గ్రామస్తుల సమక్షంలో కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పేద ప్రజల అభ్యున్నతికై ఐక్యత ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు ఇంకా పెద్ద ఎత్తున కొనసాగిస్తామన్నారు. దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... అడిగిన వెంటనే సహాయసహకారాలు అందిస్తున్న సుంకిరెడ్డికి ఎల్లవేళలా రుణపడి ఉంటామని, చెన్నకేశవస్వామి ఆశీస్సులు వారిపై ఎల్లపుడు ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అనిల్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బీస బాలరాజు, దేవాలయ కమిటీ సభ్యులు శ్రీను, శరత్, కురుమయ్య, సైదులు, వెంకటయ్య, లాలయ్య, నరసింహా, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటీటీలో అల్లు అర్జున్ 'పుష్ప 2'.. స్ట్రీమింగ్‌కి వచ్చేది ఎప్పుడంటే?

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన 'పుష్ప2: ది రూల్' ప్రస్తుతం బాక్సాఫీసు వద్ద రికార్డులు తిరగరాస్తోంది. భారతీయ సినీ చరిత్రలో ఏ కమర్షియల్ మూవీ సాధించనన్ని వసూళ్లు రాబడుతోంది. ఈ క్రమంలో 'పుష్ప 2' ఓటీటీకి రానున్నదంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వార్తలు ట్రెండ్ అయ్యాయి. ముఖ్యంగా జనవరి రెండో వారం నుంచి స్ట్రీమింగ్ కానుందంటూ పోస్టులు కనిపించాయి. ఎట్టకేలకు ఆ వార్తలపై చిత్రబృందం తాజాగా స్పందించింది. 56 రోజుల (థియేటర్లలో విడుదలైన నాటి నుంచి) కంటే ముందు ఏ ఓటీటీలోనూ ఈ మూవీ రిలీజ్ కాదని స్పష్టం చేసింది. వెండితెరపైనే 'పుష్ప 2'ను చూసి హాలీడే సీజన్‌ను ఎంజాయ్ చేయమని చెప్పింది.పుష్ప2: ది రూల్' ఓటీటీ స్ట్రీమింగ్‌పై అనేక వార్తలు తిరుగుతున్నాయి. రాబోయే అతి పెద్ద హాలీడే సీజన్‌లో ఈ మూవీని వెండితెరపై చూసి ఆస్వాదించండి. విడుదలైన నాటి నుంచి 56 రోజుల కన్నా ముందు ఏ ఓటీటీలోనూ 'పుష్ప2' స్ట్రీమింగ్ కాదు. ఇది వైల్డ్ ఫైర్ పుష్ప. వరల్డ్ వైడ్‌గా థియేటర్స్‌లోనే.. - ఎక్స్‌లో మైత్రీ మూవీ మేకర్స్‌మరోవైపు ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా రూ.1,508 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. 'కేజీయఫ్2' (రూ.1250 కోట్లు), 'RRR' (రూ.1,387 కోట్లు) ఆల్‌టైమ్ కలెక్షన్లు దాటేసిన 'పుష్ప2'.. 'బాహుబలి2' (రూ.1810 కోట్లు) వసూళ్లను దాటే దిశగా వెళ్తోంది. అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన భారతీయ చిత్రాల జాబితాలో ఆమిర్‌ఖాన్ 'దంగల్' (రూ.2,024 కోట్లు) ఇప్పటికీ టాప్‌లో ఉంది. ముంబయి సర్క్యూట్‌లో రూ.200 కోట్లు (నెట్) సాధించిన తొలి సినిమాగా రికార్డు సృష్టించిన 'పుష్ప 2' హిందీలో రూ.632 కోట్లు (నెట్) వసూలు చేసి, 100 ఏళ్ల బాలీవుడ్ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. విడుదలైన 15 రోజుల్లోనే ఆ మొత్తాన్ని వసూలు చేయడం మరో విశేషం.



## జాన్వీ క్రిస్మస్ స్పెషల్ ఫోటోలు.. పొట్టి డ్రెస్ లో హాట్ హాట్ గా

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ సినిమాలతో పాటూ సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు హాట్ హాట్ ఫోటోలు షేర్ చేస్తూ కుర్రకారును ఆకట్టుకుంటోంది.తాజాగా ఇన్ స్టాగ్రామ్ లో క్రిస్మస్ స్పెషల్ ఫోటోలు షేర్ చేసింది. పొట్టి డ్రెస్ లో హాట్ హాట్ గా ఫోజులిస్తూ ఫోటోలు దిగింది.ఈ ఫొటోల్లో జాన్వీ కపూర్ బెడ్ పై పడుకొని నాటీగా ఉండు.. శాంటాను కాపాడు అంటూ ఉన్న క్యాప్షన్ కూడా పెట్టింది.ఈ పిక్స్ చూసి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. జాన్వీ క్రిస్మస్ సెలెబ్రేషన్స్ మాములుగా లావుగా అంటూ కామెంట్స్ చేస్తున్నారు.ఇన్నాళ్లు బాలీవుడ్ లో సినిమాలు చేస్తున్న ఈ ముద్దుగుమ్మ 'దేవర' సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది.

# sports స్పోర్ట్స్



## అచ్చొచ్చిన వేదికలో అదరగొడతాడా?

3 మ్యాచ్‌లు.. 126 పరుగులు.. 31.5 సగటు.. ప్రస్తుత బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో విరాట్ కోహ్లి ప్రదర్శన ఇది. తన లాంటి మేటి బ్యాటర్ నుంచి జట్టు, అభిమానులు ఆశించే ప్రదర్శన కాదిది. అందులోనూ తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఒత్తిడి లేని, అనుకూల పరిస్థితుల మధ్య సాధించిన సెంచరీని మినహాయించి చూస్తే విరాట్ ప్రదర్శన పేలవం. సిరీస్ గమనాన్ని నిర్దేశించే నాలుగో టెస్టులో అయినా కోహ్లి ఫామ్ అందుకోవాలని, తన స్థాయి ఇన్నింగ్స్ ఆడాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈసారి అతనాడబోయేది తనకు అచ్చొచ్చిన వేదిక కావడంతో విరాట్ (Virat Kohli) ఆట మారుతుందనే ఆశతో ఉన్నారు.ప్రతిష్ఠాత్మక మెల్‌బోర్న్ మైదానంలో ఆడిన మూడు టెస్టుల్లో ఈ స్టార్ బ్యాటర్ 52.66 సగటుతో 316 పరుగులు సాధించాడు. అందులో ఓ సెంచరీ, రెండు అర్ధసెంచరీలు ఉన్నాయి. 2014లో ఇక్కడ సాధించిన 169 ఇన్నింగ్స్‌తో విరాట్ పేరు మార్మోగిపోయింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ 54 పరుగులతో జట్టుకు ఓటమి తప్పించాడు. ఇదే మైదానంలో విరాట్.. క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోయే టీ20 ఇన్నింగ్స్ ఆడాడు. రెండేళ్ల కిందట టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై ఛేదనలో 53 బంతుల్లో 82 పరుగులతో జట్టును గెలిపించిన తీరును అభిమానులను ఎప్పటికీ మరిచిపోలేరు. ఇలా మెల్‌బోర్న్‌లో మధుర జ్ఞాపకాలున్న విరాట్.. ఆ స్ఫూర్తితో నాలుగో టెస్టులో చెలరేగుతాడని అభిమానులు ఆశిస్తున్నారు. 1-1తో సమంగా ఉన్న సిరీస్‌లో ఏ జట్టు పైచేయి సాధిస్తుందన్నది మెల్‌బోర్న్ టెస్టే నిర్దేశించనుంది.ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే టీమ్‌ఇండియా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ బెర్తుపై ఆశలుంటాయి. ఇలాంటి కీలక మ్యాచ్‌లో కోహ్లి ఎలా రాణిస్తాడన్నది ఆసక్తికరం. లక్షకు పైగా సామర్థ్యం ఉన్న మెల్‌బోర్న్ స్టేడియం.. నాలుగో టెస్టుకు నిండుగా అభిమానులతో కనిపించనుంది. వారిలో కోహ్లి ఆట చూసేందుకు వచ్చేవాళ్లు చాలామందే ఉంటారు. ఆస్ట్రేలియన్లలో కూడా విరాట్‌ను అభిమానించేవారు తక్కువేమీ కాదు. మరి వారి అంచనాలను కోహ్లి అందుకుంటాడా? తనకు కలిసొచ్చిన మైదానంలో ఒకప్పట్లా చెలరేగుతాడా?



## భారత్ 211 పరుగుల తేడాతో..

సొంతగడ్డపై భారత మహిళల జట్టు చెలరేగుతోంది. వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌ను 2-1తో గెలుచుకున్న టీమ్‌ఇండియా.. మూడు వన్డేల (IND w Vs WI w) సిరీస్‌లోనూ ఘనంగా బోణీ కొట్టింది. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన (91; 102 బంతుల్లో 13×4).. బౌలింగ్‌లో రేణుక సింగ్ (5/29) సత్తా చాటడంతో ఆదివారం తొలి వన్డేలో భారత్ ఏకంగా 211 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తు చేసింది. మొదట భారత్ 9 వికెట్లకు 314 పరుగులు చేసింది. ఛేదనలో విండీస్ 26.2 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. మొదట భారత ఇన్నింగ్స్‌లో స్మృతి ఆటే హైలైట్. దూకుడు కొనసాగించిన ఈ ఓపెనర్ నాలుగో అర్ధసెంచరీతో అదరగొట్టింది. తనశైలిలో ఆఫ్‌సైడ్ మెరుపు షాట్లు ఆడిన ఆమె.. ప్రతీక రావల్ (40)తో కలిసి తొలి వికెట్‌కు 110 పరుగులు జత చేసి శుభారంభం అందించింది.ఆ తర్వాత హర్లీన్ డియోల్ (44) తోడుగా ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లింది. సెంచరీ చేసేలా కనిపించిన స్మృతి.. జైదా బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగింది. ఆమె ఔటైనా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (34), రిచా ఘోష్ (26), జెమీమా రోడ్రిగ్స్ (31) తలో చేయి వేసి స్కోరు 300 దాటించారు. విండీస్ బౌలర్లలో జైదా జేమ్స్ (5/45) ఆకట్టుకుంది. ఛేదనలో కరీబియన్ జట్టు ఆరంభం నుంచే తడబడింది. తొలి బంతికే ఓపెనర్ కియానా జోసెఫ్ (0) రనౌట్ కాగా.. ఆ తర్వాత రేణుక విజృంభించింది. దీంతో 26కే సగం మంది బ్యాటర్లను కోల్పోయిన విండీస్ ఆపై కోలుకోలేకపోయింది. షిమైన్ క్యాంప్‌బెల్ (21), అఫీ ఫ్లెచర్ (24 నాటౌట్), అలియా (13), కరిష్మా (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. టీమ్‌ఇండియా బౌలర్లలో రేణుకతో పాటు ప్రియ మిశ్రా (2/22), తితాస్ సాధు (1/24), దీప్తిశర్మ (1/19) రాణించారు.సంక్షిప్త స్కోర్లు... భారత్: 314/9 (మంధాన 91, ప్రతీక 40, హర్లీన్ 44, హర్మన్‌ప్రీత్ 34, రిచా 26, జెమీమా 31; జైదా జేమ్స్ 5/45) వెస్టిండీస్: 103 ఆలౌట్ (అఫీ ఫ్లెచర్ 24 నాటౌట్, షిమైన్ క్యాంప్‌బెల్ 21; రేణుక 5/29, ప్రియ 2/22)


Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in